https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737



డీకే సారథ్యంలో
చాటింపు
తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 14 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శుక్రవారం,అక్టోబర్,9, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

ఆ నలుగురికి కచ్చితంగా
శిక్ష పడుతుంది: రాహుల్ గాంధీ

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్- మూడో రోజుకు చేరిన ఇండియా కూటమి నిరసనలు- మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్ ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారన్న రాహుల్- వారికి శిక్ష తప్పదని, ఇది తన హామీ అని వ్యాఖ్య

- నేడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్న విపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ,అక్టోబర్,08:కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం సైతం విపక్ష ఎంపీలు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్.. ఈ నలుగురూ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది, అది మీరే చూస్తారు. ఇది మా హామీ" అని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. "మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లనివ్వలేదు.మాఎంపీలపై దాడి చేశారు" అని ఆయన పేర్కొన్నారు. నిరసనల్లో భాగంగా విపక్ష ఎంపీలు తొలుత రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించారు. కాగా, ఈ అంశంపై తదుపరి కార్యాచర ణకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్రపతి



ద్రౌపదీ ముర్ముతో విపక్ష ఎంపీలు భేటీ కానున్నారు. ఇందుకోసం ఇప్పటికే అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఎన్నికల సంఘంపై వస్తున్న ఆరోపణల గురించి వారు రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించనున్నారు.

సైబర్ మోసాల
నివారణకు గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్..

-ప్రధాని మోడీ కీలక పిలుపు

న్యూఢిల్లీ,అక్టోబర్,08:భారతదేశంలో డిజిటల్ విప్లవం మరింత వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రపంచవ్యాప్త సమన్వయం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026 పదో ఎడిషన్‌ను అక్టోబర్ 8న ప్రధాని మోడీ ప్రారంభించారు. అక్టోబర్ 7నుంచి 10 వరకు నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ టెక్నాలజీ కార్యక్రమంలో టెలికాం, ఐటీ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డిజిటల్ ఆవిష్కరణలు, సైబర్ భద్రత వంటి అంశాలకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇచ్చారు. డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాల ప్రమాదం కూడా పెరుగుతోందని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు దేశాల మధ్య సమన్వయం అవసరమని, ఇందుకోసం గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. +హీూతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెలికాం ఆపరేటర్లు, సంబంధిత భాగస్వాములు ఈ ప్రయత్నంలో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విధమైన అంతర్జాతీయ వ్యవస్థ డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠం



చేయడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో డిజిటల్ విప్లవం సాధించిన పురోగతిని ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

2022లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ వేదిక నుంచే 5+ సేవలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. గత నాలుగేళ్లలో దేశంలోని అన్ని జిల్లాలకు 5+ నెట్‌వర్క్ విస్తరించిందని, ప్రస్తుతం భారత్‌లో 5.5 లక్షలకు పైగా 5+ బేస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. తదుపరి తరం టెలికాం సాంకేతికత అయిన 6+ అభివృద్ధిపైనా భారత్ దృష్టి సారించిందని పేర్కొన్నారు. 5+ సేవల విస్తరణతో వేగవంతమైన ఇంటర్నెట్, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, సాంకేతిక ఆధారిత పరిశ్రమలకు మరింత అవకాశాలు ఏర్పడుతున్నాయని వివరించారు.

10న జంతర్‌మంతర్ దగ్గర సీజేపీ నిరసన

పాల్గొననున్న మమతాబెనర్జీ!



న్యూఢిల్లీ,అక్టోబర్,08:సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఈనెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర సీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఇప్పుడు అదే తరహాలో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ నిరసనకు దిగబోతున్నారు. ఇప్పటికే విపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. పలువురు పాల్గొనే అవకాశం ఉంది. ఇక బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా సీజేపీ నిరసనల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం అంతర్జాతీయ విమానాశ్రయంలో మమత మీడియాతో మాట్లాడుతూ "అక్టోబర్ 10న జంతర్ మంతర్ దగ్గర జరగనున్న నిరసనలో నేను పాల్గొనవచ్చు. కానీ ఇప్పుడే ఏదీ ఖరారు చేయలేం. మేము వారితో (సీజేపీతో) సంబంధాలు కొనసాగిస్తున్నాం. మా మద్దతును తెలియజేశాము. మా భాగస్వామ్యానికి సంబంధించిన తదుపరి నిర్ణయం తర్వాత తీసుకుంటాము." అని అన్నారు. ఈ సందర్భంగా మరోసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఎన్నికల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇదే సమయంలో అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న జజీూ నిరసనలో తాను పాల్గొనే అవకాశముందని చెప్పారు.

తుగ్లక్ నిర్ణయాలతో
బొగ్గు ఉత్పత్తి పడిపోయింది..

- 14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన సభ:హరీష్ రావు - కార్మికుల హక్కులు, డిపెండెంట్ ఉద్యోగాలపై డిమాండ్లు- బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు- గుర్తింపు యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్

సింగరేణి బొగ్గు గని ప్రాంత సమస్యలు, కార్మికుల సంక్షేమంపై మాజీ మంత్రి హరీష్ రావు అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 14న రామగుండంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభకు 'సింగరేణి కార్మిక గర్జన' అని పేరు నిర్ణయించినట్లు వెల్లడించారు. సింగరేణి సంస్థ ఆర్జించే లాభాల్లో కార్మికులకు చెల్లించాల్సిన వాటాను వెంటనే ఇవ్వాలని, అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వీటితో పాటు ఎంతమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని, అలాగే ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన పెండింగ్ బిల్లుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత, తుగ్లక్ నిర్ణయాల వల్లే నేడు సింగరేణి సంస్థ ఆదాయం గణనీయంగా పడిపోయిందని హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎప్పటిలాగే



కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, యాజమాన్యం , ప్రభుత్వ వైఫల్యం వల్ల ఉత్పత్తి దారుణంగా తగ్గిపోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకంగా 12 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి తగ్గిపోయిందని ఆరోపించారు. గతంలో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి, నేడు 58 మిలియన్ టన్నులకు పడిపోవడం ప్రభుత్వ అసమర్థ పరిపాలనకు నిదర్శనమని మండిపడ్డారు

కెనడా రచయిత్రి ఆన్ కార్సన్‌కు సాహిత్యంలో నోబెల్..

కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త ఆన్ కార్సన్‌ను 2026 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి వరించింది. సాహసోపేతమైన, వినూత్న సాహిత్య రచనలకు గాను 76 ఏళ్ల కార్సన్‌ను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం ప్రకటించింది. సాంప్రదాయ సాహిత్యంతో ఆధునిక సాహిత్యానికి కొత్తదనం అద్దిన కార్సన్ ఈ అవార్డుకు అర్హురాలని పేర్కొంది కెనడాలోని టొరంటోలో జన్మించిన ఆన్ కార్సన్ రచనల్లో ప్రాచీన గ్రీకు, రోమన్ సాహిత్య ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆమె కవిత్వం, వ్యాసాలు, గద్య రచనలు, అనువాదాలను కలిపి ప్రత్యేకమైన రచనా శైలిని అభివృద్ధి చేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యాన్ని అనువదించడంలోనూ కార్సన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. పదాల మూలాలు, భాష, కవిత్వం మధ్య సంబంధాన్ని ఆమె రచనల్లో విభిన్నమైన రీతిలో ఆవిష్కరించారు 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్', 'ఎరోస్ ది బిటర్‌స్వీట్', 'మెన్ ఇన్ ది ఆఫ్ అవర్స్', 'నార్మా జీన్ బేకర్ ఆఫ్ ట్రాయ్' వంటివి కార్సన్ రచనల్లో ప్రముఖమైనవి (ూఅఅవ ఝుతీంశీఅ ఎశీశీఎం). కవిత్వం, గద్యరచన, నాటకం, అనువాదం వంటి విభిన్న



సాహిత్య ప్రక్రియలను కలిపి ఆమె రచనలు సాగుతాయి. కాగా, 2026 సాహిత్య నోబెల్ బహుమతి విజేతకు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్ నగదు పురస్కారం అందిస్తారు. ఇది సుమారు 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లకు సమానం. మన కరెన్సీలో రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది.

ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ..
గోదావరి పుష్కరాల నిధులపై చర్చ..!



న్యూఢిల్లీ,అక్టోబర్,08: ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ(ూఎ వీశీఎఅ)తో సీఎం చంద్రబాబు(జఎ జష్ట్రుఅఎతీఝుఎఎబ) భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల(+శీఎఝుఝుతీఅ ూబంష్ట్రఎఝుతీఝుశ్రీబ)కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. పుష్కరాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు గోదావరి(+శీఎఝుఝుతీఅ) నదీతీర ప్రాంతాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో.. ఘాట్ల అభివృద్ధి, మౌలిక వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర ఏర్పాట్లకు కేంద్ర సహకారం అందించాలని కోరినట్లు సమాచారం. పుష్కరాల నిర్వహణకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కూడా ప్రధాని దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. విశాఖపట్నం మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల అంశంతో పాటు కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక ఆర్థిక సాయం కోరినట్లు సమాచారం. అలాగే గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం, నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు పురోగతి వంటి అంశాలు కూడా కేంద్రం ముందుకు తీసుకెళ్లినట్లు సమాచారం. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పనులను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన భేటీలో చంద్రబాబు వివరించారు.

యూపీఐ లావాదేవీలపై ఛార్జెస్ జనవరి నుంచి?



న్యూఢిల్లీ,అక్టోబర్,08:యూపీఐ ద్వారా జరిగే రూ.2000పైన లావాదేవీలపై ప్రతిపాదించిన ఛార్జీల అమలును కొన్ని నెలలపాటు వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు పండగల సీజన్ ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం ఉన్నది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలను అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ నిర్ణయంవల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరుకుంది. అదేవిధంగా పండగల సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుంది. కాగా ఆరేళ్లకుపైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు.ార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.ఇది వ్యాపారులవైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకుపైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 లోనే యూపీఐద్వారా రూ.29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచిఛార్జీల అమలు మొదలుపెడితే అది దసరా, దీపావళి వంటి పండగల వేళ వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలుగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం.

తెలంగాణలో మండుతున్న ఎండలు..
పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగా యని,పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏఎస్‌రావు నగర్‌లో రూ.1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



మేడ్చల్ మల్కాజ్‌గిరి(డీకే చాటింపు): ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం ఏఎస్‌రావు నగర్ వార్డ్ నంబర్-15 పరిధిలో రూ.1.83 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 7 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధానంగా సీసీ రోడ్లతోపాటు స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులను చేపడతారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాన్ని కల్పించేందుకు, వానా కాలంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ పనులు చేస్తారు. అయ్యప్ప స్వామి ఆలయం, సౌత్ కమలా నగర్ బైలేన్లు, మహేష్ నగర్--గాయత్రి నగర్ రోడ్, నాయక్రాంతి నగర్--నేతాజీ నగర్ జంక్షన్, శ్రీనివాస్ నగర్, కమలా నగర్, శ్రీనగర్ కాలనీ, సుభాష్ చంద్ర నగర్, న్యూ శ్రీనివాస్ నగర్, వీఎన్ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఈ అభివృద్ధి పనులు జరగనున్నాయి. అయ్యప్ప స్వామి ఆలయం, సౌత్ కమలా నగర్ పరిధిలో సీసీ రోడ్లు, బైలేన్ల నిర్మాణానికి రూ.30.50 లక్షలు, మహేష్ నగర్ నుంచి గాయత్రి నగర్ రోడ్ వరకు సీసీ రోడ్‌కి రూ.19 లక్షలు, నాయక్రాంతి నగర్ ప్లాట్ నంబర్ 58 నుంచి నేతాజీ నగర్ జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్‌కి రూ.52 లక్షలు, ఆటోస్టాండ్, శ్రీనివాస్ నగర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద కమలా నగర్‌లో సీసీ రోడ్లకి రూ.18 లక్షలు, పోచమ్మ ఆలయం, శ్రీనగర్ కాలనీలో సీసీ రోడ్లకి రూ.16.50 లక్షలు, సుభాష్ చంద్ర నగర్‌లో హెచ్.నం. 9-124/బీ నుంచి రిమ్ డిజైన్ టెక్నాలజీస్ వరకు సీసీ రోడ్‌కి రూ.28 లక్షలు, న్యూ శ్రీనివాస్ నగర్ రోడ్లు 10, 11, 12తోపాటు వీఎన్ రెడ్డి నగర్‌లో కల్వర్ట్ సమీపంలో సీసీ రోడ్లకి రూ.19 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఏఎస్‌రావు నగర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు సోమశేఖర్, మాజీ కార్పొరేటర్లు శిరీష, రామారావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహిపాల్, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట మండల పిఆర్టియు నూతన కార్యవర్గం ఎన్నిక

-అధ్యక్షులుగా మొల్గాన్ జనార్దన్,ప్రధాన కార్యదర్శిగా సాయప్ప...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండల పిఆర్టియు అధ్యక్షులుగా మొల్గాన్ జనార్దన్,ప్రధాన కార్యదర్శిగా సాయప్ప ఎన్నికయ్యారు.జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం జరిగిన నారాయణపేట మండల కార్యవర్గ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు.ఇటీవల జరిగిన పిఆర్టియు టిఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులుగా నారాయణపేట మండల అధ్యక్షులు రఘువీర్ ఎన్నిక కావడంతో నూతన అధ్యక్షుని ఎన్నిక జరిగింది.మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న మొల్గాన్ జనార్దన్ మండల అధ్యక్షులుగా,మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బైరంకొండలో విధులు నిర్వహిస్తున్న సాయప్ప ప్రధాన కార్యదర్శిగా కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎం. రఘువీర్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం మండలంలోని ఉపాధ్యాయులకు,జిల్లా సంఘానికి అందుబాటులో ఉండి..సంఘ ఉన్నతికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పిఆర్టియు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై. నారాయణ రెడ్డి,దామరగిద్ద, ఊట్కూరు మండలాల బాధ్యులు సత్యనారాయణ రెడ్డి,రమేష్ రెడ్డి, నరసింహారెడ్డి,రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్, నర్సింగ్,అనిల్,బాలాజీ, అరవింద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

-నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక... -ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నమే... -ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి... -కళాశాల జీవితం కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుండా ఉండాలి... -కళాశాల జీవితం భవిష్యత్తుకు బలమైన పునాది... -నారాయణపేట జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్...



నారాయణపేట,(డీకే చాటింపు): విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక సూచించారు.గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు, సిబ్బందికి ముందుగా దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల రోజులను గుర్తు చేసుకోవడం ద్వారా ఎంతో నాస్టాల్జిక్‌గా అనిపిస్తోందని, విద్యార్థి దశలో స్నేహితులతో కలిసి గడిపిన సమయం జీవితంలో ఎంతో విలువైనదని పేర్కొన్నారు. కళాశాల జీవితం కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి,నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులు తమ గురించి తాము తెలుసుకునే ప్రయత్నం చేయాలని,తమకు ఏ రంగంపై ఆసక్తి ఉంది,ఏ రంగంలో నైపుణ్యం ఉందో గుర్తించి ఆ దిశగా కృషి చేయాలన్నారు. ప్రాబ్లమ్ సాల్వింగ్,కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్ వంటి నైపుణ్యాలను కళాశాల దశలోనే పెంపొందించుకోవాలని సూచించారు.ఈ రెండు, మూడు ఏళ్ల కళాశాల జీవితం భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునే సమయమని,దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోకుండా పెద్దగా కలలు కనాలని జిల్లా కలెక్టర్ సూచించారు.సివిల్ సర్వీసెస్,యూపీఎస్సీ,వైద్య, చార్టర్డ్ అకౌంటెన్సీ,సైన్స్ తదితర రంగాల్లో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు.ఒకే కళాశాలలో,ఒకే తరగతి గదిలో చదువుతున్న విద్యార్థుల్లో భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను చేరుకునే వారు ఉంటారని తెలిపారు.ఎవరి భవిష్యత్తు ఎలా ఉండాలన్నది వారు తీసుకునే నిర్ణయాలు, పెంపొందించుకునే నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరి జీవన ప్రయాణం భిన్నంగా ఉంటుందని, ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని సూచించారు. కొంతమంది త్వరగా విజయాన్ని సాధిస్తే, మరికొందరు కొంత ఆలస్యంగా విజయాన్ని అందుకోవచ్చని,సమయం ఏదైనా లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయడం ముఖ్యమని అన్నారు. వివాహం,కుటుంబ బాధ్యతల అనంతరం కూడా పోటీ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు సాధించిన అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం సాంకేతికత అందుబాటులో ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారం,అవకాశాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులకు ఉందని కలెక్టర్ అన్నారు.అవకాశాలు లేవని భావించకుండా, అందుబాటులో ఉన్న అవకాశాలను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు.విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించడంతో పాటు కొత్త విషయాలను నేర్చుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు.ఆత్మవి శ్వాసమే విజయానికి కీలకమని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులు కళాశాల జీవితాన్ని ఆనందంగా గడుపుతూనే ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, క్రమశిక్షణతో చదువుకో వా లని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, దానిలో ప్రతిభను నిరూపించుకునేలా కృషి చేయాలని,ప్రతి ఒక్కరూ ఉన్నత విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆటలాడి ప్రోత్సహిం చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల, కళాశాల ప్రిన్సిపల్ మెర్సీ వసంత,కళాశాల లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11 నుండితెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్.ఎస్.సి,ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్

పరీక్ష కేంద్రాల పరిదిలో 144 సెక్షన్ అమలు: పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 08(డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ కమిష నరేట్ పరిధిలో 11-10-2026 నుండి 17-10-2026 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టూస్కూ)ఎస్.ఎస్.సి ,ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ అక్టోబర్- 2026 పరీక్షను ప్రశాంతంగానిర్వ హించేందుకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇట్టి ఎగ్జామ్నేషన్ సెంటర్స్ పరినర ప్రాంతాలలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎన్ (పాత సెక్షన్144సి.ఆర్. పి.సి) అమలు ఉంటుందిపోలీస్ కమీషనర్ సాయి చైతన్య తెలిపారు.జిల్లాలోఆదర్శ హిందీ విద్యాలయం హై స్కూల్ హిందీ మీడియం నిజామాబాద్ (ఎస్.ఎస్.సి) మరియుఆదర్శ హిందీ విద్యాలయం హై స్కూల్ ఇంగ్లిష్ మీడియం లోఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు గలవు.కావున పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు , మధ్యాహ్నం 2:30 నుండి 5:30 గంటల వరకు కలదు.ఇట్టి ఎగ్జమినేషన్ సెంటర్ లలో పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సా యి చైతన్య, తెలిపారు. పరీక్షలు జరిగే రోజు ఉదయం 7:30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షా కేంద్రముల పరిసర ప్రాం తాల్లో సెక్షన్ అమలులో ఉంటుందని ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధం. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని పరీక్ష కేంద్రాలపరిధిలో ఉదయం 7:30గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ షాపులు మరియు స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివే యాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడు తుంద ని , కేంద్రాల వద్ద అనుమ నాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.పరీక్షలు రాసే విద్యార్థులందరూ ప్రశాంతంగా , ఆత్మవిశ్వాసం తో పరీక్షలు రాసి విజయ వంతంగా ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ విద్యార్థుల కు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

వినియోగం మరింత విస్తృతం చేయాలి

అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 08 (డీకే చాటింపు): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీస్ శాఖకు అనుసంధానం చేసి , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సేవలను సమర్థవంతం గా వినియోగించుకోవడం ద్వారా పోలీసింగ్‌ను మరింత వేగవంతంగా , పారదర్శకంగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ ఎన్. శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , ప్రొఫెసర్లు , ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారు.పోలీస్ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏ విధంగా అనుసంధానం చేయాలి , పోలీసింగ్‌లో ఏఐ ఆధారిత సాంకేతికతను ఏయే రంగాల్లో వినియోగించుకోవచ్చు అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా నేరాల విశ్లేషణ , నేరాల నివారణ , క్రైమ్ డేటా విశ్లేషణ , అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు , ట్రాఫిక్ నిర్వహణ , సీసీటీవీ ఫుటేజీ విశ్లేషణ , సైబర్ నేరాల దర్యాప్తు , సోషల్ మీడియా మానిటరింగ్ , ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా అందించడం వంటి అంశాల్లో ఏఐ సాంకేతిక తను వినియోగించుకునే అవకాశాలపై సమీక్షించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బందికి అవసరమైన శిక్షణ , సాంకేతిక నైపుణ్యాల పెంపు , కళాశాలల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీస్ శాఖకు ఉపయోగపడే ఏఐ ఆధారిత పరిష్కారాలు , సాఫ్ట్‌వేర్‌లు మరియు అప్లికేషన్ల అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించారు. విద్యాసంస్థలు , సాంకేతిక నిపుణులు మరియు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తే ప్రజా భద్రతకు మరింత మెరుగైన సేవలు అందించ డంతో పాటు , భవిష్యత్ పోలీసింగ్‌ను సాంకేతికత ఆధారితంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్ పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో , పోలీస్ శాఖ కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చు కొని నేర నియంత్రణ , దర్యాప్తు , ప్రజా భద్రత మరియు పోలీస్ సేవలలో మరింత సమర్థవంతమైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో నవ్య భారతి జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శిరీష్ , విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్వప్న , ఫ్యాకల్టీ సుజాత, నవ్య, లక్ష్మి , కాకతీయ కాలేజీ కిడ్స్ అధికారులు డి.వేణుగోపాల్ , పి.నాగార్జున , క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ నుండి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సి.ఓ.డి ఎం. లక్ష్మణ్ మరియు సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొనడంజరిగింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో

కాంట్రాక్ట్ వర్కర్స్ వేతనాలు పెంచాలి

-ఆసుపత్రి కార్మికులపై కాంట్రాక్టర్ల వేధింపులు ఆపాలి... -కార్మికులకు పని భారం తగ్గించాలి... -ఆసుపత్రి సామర్థ్యానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలి.... టియుసిఐ డిమాండ్... -నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ బాలాజీకి వినతి పత్రం అందజేత...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పేషెంట్ కేర్ నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కారణంగా కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టియుసిఐ)రాష్ట్ర అనుబంధ సంఘం "తెలంగాణ ప్రగతిశీల ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ ఉఎంప్లాయీస్ యూనియన్" తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది .?ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ బాలాజీకి గురువారం ఓ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.60 ప్రకారం నెలకు రూ.15,600 ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సర్కులర్ ఆర్.సి.నెం.65/డిఎంఈ/2022 ప్రకారం ప్రతి కార్మికుడికి పి.ఎఫ్,ఈ.ఎస్.ఐ పోను రూ.12,093 చెల్లించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు కేవలం రూ.11 వేలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.ప్రస్తుత పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.?వెండర్ల నిబంధనలు,అమలు నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని,లేనియెడల ఈసారి నిర్వహణలో టెండర్ల ద్వారా కార్మికునికి కనీస వేతనం రూ. 26 వేలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.?కార్మికుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి,కాంట్రాక్టర్లతో మాట్లాడి చట్టబద్ధంగా కార్మికులకు రావాల్సిన వేతనాలు,ఇతర సౌకర్యాలు అందేలా న్యాయం చేయాలని,లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామనీ హెచ్చరించారు.కాంట్రాక్టర్లు కార్మికులను అనేక రకాలుగా వేదిస్తున్నారు.అసభ్య పదజాలంతో దూసిస్తున్నారు. బాషా మార్చుకోవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టియుసిఐ జిల్లా ఉ పాధ్యక్షులు కె.కాశినాథ్,బి. నర్సిములు,జిల్లా కార్యదర్శి బోయిన్ పల్లి రాము,సహాయ కార్యదర్శి ఎదిరింటి నర్సింహా ఉన్నారు.

శ్రీ రఘునాథ ఆలయం ఖిల్లా లో రోప్ వే కొరకు సర్వే



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 08 (డీకే చాటింపు): నిజామాబాద్ నగరం లోనీ ఖిల్లా రామ మందిరం కు వెళ్ళడానికి రోప్ వే నిర్మాణ సాధ్య సాధ్యలపై పర్వత మాల కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా పరిశీలన కు ఇంజనీర్లు సర్వే చేశారు. ఇందూరు అభివృద్ధికి నాంది లో భాగంగా స్థానిక అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త మరియు పార్లమెంట్ సభ్యులు శ్రీ ధర్మపురి అరవింద్ చొరవతో అధికారులు సర్వే చేశారని ఆలయ చైర్మన్, డైరెక్టర్ ముక్క దేవేందర్ గుప్తా,పెండ్యాల శ్రీనివాస్, తాటి వీరేశం లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ముఖ్యమంత్రి, మంత్రులు మరియు అధికార బృందం వారు కూడా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.ఆలయంలో ఉన్న లిఫ్ట్ చెడిపోవడం తో అట్టి లిఫ్ట్ రిపేర్ కు పెండ్యాల పశుపతినాథ్ 30 వేలు విరాళం గా ఇవ్వగా రిపేర్ చేయించమని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి చేస్తున్న,ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, ఈ దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని కమిటీ సభ్యులు కోరారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం,అక్టోబర్,9, 2026

రూపాయి ఎందుకు క్షీణిస్తోంది..?

డాలర్ పడిపోతున్న తరుణంలో ఆ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోవడం అంటే ఆర్థిక దారుణమేనా? డాలర్ బలంగా ఉండి అన్ని దేశాల కరెన్సీలు పడిపోతున్నాయి, ఆ క్రమంలో మన రూపాయి కూడా పడిపోతోందని అనుకున్నా ఒక అర్థం ఉంది.కానీ డాలర్ పతనం అవుతున్నా, మన రూపాయి విలువ పెరగక పోవడాన్ని ఏ విధంగా చూడాలి? అన్నదే చర్చగా ఉంది. అసలు ఈ విలువ పతనానికి కారణాలు విశ్లేషించడానికి ఆర్థిక నిపుణులకు ధైర్యం చాలడం లేదు. యూపీఏ హయాంలో మన్మోహన్ వంటి ఆర్థిక నిపుణుడు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో.. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంకును రంగంలోకి దింపి విదేశీ కరెన్సీ విక్రయాలు చేసి రూపాయిని కాస్త బలం పుంజుకునేలా చేశారు. కనీసం పడిపోకుండా ఆపే ప్రయత్నం చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి విధానాలను పట్టించుకోవడం లేదు. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపారాలపై ప్రభావం చూపిస్తోంది. పాలకుల వద్ద దీనికి పరిష్కారం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థైర్యాన్ని కొలిచే కీలక సూచీలో ఒకటి కరెన్సీ విలువ. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్ల ఒత్తిడికి, దేశీయ విధాన పరమైన వైఫల్యాలకు, రాజకీయ–ఆర్థిక అనిశ్చితులకు రూపాయి బలి అవుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న రూపాయి విలువ భారీగా పతనం అయింది. డాలర్‌తో పోలిస్తే 90 రూపాయలు క్షీణించి ఆల్ టైం రికార్డ్‌గా నమోదైంది. ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయినా మన పాలకులు రూపాయి ఎందుకు పడిపోయిందో గుర్తించి కట్టడి చేయాలని ఎందుకు అనుకోరు? విదేశీ మదుపుదారులు స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుం టున్నారు. వాటిని ఇతర చోట్లకు తరలిస్తున్నారు. వారంతా డాలర్ల రూపంలోనే లావాదేవీలు చేస్తారు కాబట్టి డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతోంది. ట్రంప్ బెదిరింపులు, వాణిజ్య పోరు వంటి అనేక సమస్యలు కూడా పలు దేశాల కరెన్సీల విలువ పతనానికి కారణం అవు తున్నాయి. మనపైనా అదే ప్రభావం చూపిస్తోంది. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ చెబుతున్నప్పటికీ అవన్నీ ఉత్తుత్తి ప్రయత్నాలే.. గతంలో రూపాయి పతనం అయిన ప్రతీసారి రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగి ఫారిన్ ఎక్స్చేంజ్‌ని మార్కెట్‌లో రిలీజ్ చేసి రూపాయి విలువ పతనం కాకుండా కాపాడేది. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆర్‌బీఐ మార్కెట్‌లో ఫారిన్ ఎక్స్చేంజ్‌గా విడుదల చేసే మొత్తం 11 బిలియన్ డాలర్లకు పడి పోయింది. ఆర్బీఐ విధానాన్ని పరోక్షంగా ప్రభుత్వ విధానంగా చెప్పుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్బీఐ దగ్గర 684 బిలియన్ డాలర్ల ఫారిన్ ఎక్స్చేంజ్‌లు ఉన్నాయి. అయినా ఆర్‌బీఐ ఇప్పుడు జోక్యం చేసుకోవడం లేదు. ఈ రూపాయి విలువ పతనంలో ఆర్‌బీఐ చర్యలు తీసుకోలేక చేతులు ఎత్తేసింది. ఈ ఏడాది అక్టోబర్ 27తో పోలిస్తే ఇండియన్ రూపీ 3.5 శాతం పడిపోయింది. రూపాయి పతనం చెందుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం రివర్స్‌లో ఆలోచిస్తుంది. నిర్మలా సీతా రామన్ రూపాయి బలహీన పడడం కాదు, డాలరే బలహీన పడుతుందని ప్రకటించారు. పైగా మన దేశ ఎకానమీ ఫండమెంటల్స్ బలంగా బాగానే ఉన్నాయి. గ్లోబల్ పరిస్థితుల వలన రూపాయి పడిపోతు న్నదని వాదిస్తున్నారు. అదే నిజమైతే గ్లోబల్ గానే డాలర్ పరిస్థితి బాగా లేదు. డాలర్ కూడా పతనం చెందుతుంది. మరి ఇలాంటి సందర్భంలో మన రూపాయి విలువ ఎందుకు పడిపోతుందో చెప్పకుండా దాట వేస్తున్నారు. డాలర్‌తో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీ పెరుగుతుంటే, డాలర్ తగ్గుతుంటే ఇండియా రూపాయి మాత్రం ఎందుకు తగ్గుతోంది? దీనిని ప్రభుత్వం ఎందుకు ప్రస్తావించడం లేదు. ఎగుమతులు చేస్తే డాలర్లు వస్తాయి. దిగుమతుల వల్ల డాలర్లు రావు, డాలర్స్ సంపాదిస్తున్న దానికి ఖర్చు పెడుతున్న దానికి ఇన్ బ్యాలెన్స్ వల్లన డిమాం డ్ సప్లై మిస్ మ్యాచ్ అయ్యి రూపాయి పతనం చెందుతుంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

అభివృద్ధి పేరుతో అరాచకాలకు పాల్పడే వీ.డీ.సీలను ఉపేక్షించవద్దు

- రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్-
త్వరలోనే రాష్ట్రంలో బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు అమలులోకి రానుందని వెల్లడి





నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 08(డీకే చాటింపు): అభివృద్ధిపేరుతోఅరాచకాలకుపాల్పడుతూ,అనాగరికంగా వ్యవహరించే గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలను ఎంతమాత్రం ఉపేక్షించకూడ దని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధికారులకు స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత కూడా ఇంకనూ పలు గ్రామాలలో సామాజిక బహిష్కరణలు, జరిమానాల పేరుతో సామాన్యప్రజానీకాన్ని వేధింపులకు గురి చేయడం శోచనీయమని అన్నారు. ఈ జాడ్యాన్ని రూపుమాపేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సామాజిక బహిష్కరణ సంఘటనలపై బాధితులను నేరుగా కలిసి వారి సమస్యలనుతెలుసుకునేందుకు రాష్ట్ర బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మితో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితుల తో భేటీ అయ్యింది. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 90 మంది బాధితులు కమిషన్ ప్రతినిధులను కలిసి తమఆవేదననువ్యక్తపరుస్తూ, లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ బహిష్కరణ ఉదంతాలు చోటుచేసుకున్న ప్రాంతాల అధికారులతో క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిస్థితుల గురించి, వీ.డీ.సీలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ అరాచకాలకు పాల్పడే కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కమిటీలను ఏర్పాటుచేసుకోవ డాన్ని తాము తప్పు పట్టడం లేదని, అయితే వీ.డీ.సీల ముసుగులో అమాయక ప్రజలను బహిష్కరణలు, జరిమానాలు విధించడాన్ని ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. తమను కలిసి ఆవేదన వెలిబుచ్చిన బాధితుల బాధలు కన్నీళ్లు తెప్పించా యని ఆవేదన వెలిబుచ్చారు. ఈ వైఖరిలో మార్పు తెచ్చేందుకు అధికారులు సమిష్టిగా, అంకితభావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీ.డీ.సీలు చట్ట పరిధిలో పని చేసేలా క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని, దీనికోసం అదనపు కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదించారు. వీ.డీ.సీల అనైతిక చర్యలతో ఇబ్బందు లకు గురి అయ్యే బాధితుల కు సత్వర న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. అవసరమైతే వారికి జిల్లా యంత్రాంగం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో చైతన్యాన్నిపెంపొందించేందు కు కళా బృందాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. దశాబ్దాల కాలంగా పాతుకుపోయిన ఈ రుగ్మతను దూరం చేయక పోతే భవిష్యత్తులో ఈ జాడ్యం మరింత ప్రమాదకరం గా మారే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. వీ.డీ.సీలు చట్టానికి లోబడి పని చేసేలా,పౌరుల హక్కులు పూర్తి స్థాయిలో పరిరక్షించ బడేలా, గ్రామగ్రామాన ప్రజల్లో అవగాహన పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందిస్తూ, జిల్లాలో సామాజిక బహిష్కరణలు వంటి రుగ్మతలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటా మని అన్నారు. కమిషన్ చేసిన సూచనలను అమలు చేస్తూ, అరాచకాలకు పాల్పడే వీ.డీ.సీల ఆగడాలకు ముకుతాడు వేస్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమా లు నిర్వహిస్తామని అన్నారు.

త్వరలో అమలులోకి బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు.

కాగా, ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం తరహాలోనే వెనుకబడిన తరగతుల వారి కోసం తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే బీ.సీ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తేనుందని బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. ఈ చట్టం అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి బీ.సీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన రూపంలో సమగ్ర నివేదిక సమర్పించిందని అన్నారు. బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు అమలు పట్ల ప్రభుత్వం కూడా సానుకూలం గా ఉందని, త్వరలోనే ఇది అమలులోకి రానుందని ఆశాభావం వెలిబుచ్చారు.అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి నిజామాబాద్, ఆర్మూర్ ఏ.సీ.పీలు ప్రకాశ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, బీ.సీ కమిషన్ అధికారులు సునీత, ఇర్ఫాన్, సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాయికుమార్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 08 (డీకే చాటింపు): సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు విషకీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శు భ్రం చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది, విద్యార్థినుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో అమలు చేస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పలువురు సిబ్బంది అటెండెన్స్ నమోదు వివరాలలో తేడాలు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. హాజరులో లోపాలు ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. టాయిలెట్లు, ఫ్లోరింగ్ తదితర నిర్మాణాల పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులను ప్రశ్నించారు. కస్తూర్బా విద్యాలయాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, తక్షణమే పనులు చేపట్టి నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాసిరకం బియ్యం, సరుకులు కేటాయిస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, మరమ్మత్తులు చేయించాలని, వీలుపడని పక్షంలో కొత్త ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు.పాఠశాల ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించ బోమని, తాను వారం పది రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించా లని మండల అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ ఆరీఫ్ అహ్మద్, ఎంఈఓ రమేష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులు ఉన్నారు.

అఖండ సప్త భజన పోటీల్లో యంనోని పల్లి భజన బృందం విజేత

-గున్ముక్ల శ్రీ కడపరాయ స్వామి ఆలయంలో అఖండ సప్త భజన పోటీలు...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గున్ముక్ల శ్రీ కడపరాయ స్వామి ఆలయంలో జరిగిన అఖండ సప్త భజన పోటీల్లో యంనోని పల్లి గ్రామ భజన బృందం విజేతగా నిలిచింది. గురువారం కడపరాయ స్వామి ఆలయంలో నిర్వహించిన అఖండ సప్త భజన పోటీల్లో యంనోనిపల్లి గ్రామానికి చెందిన భజన బృందం పాల్గొంది.గ్రామం తరఫున భజన బృంద సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన బృందాన్ని నిర్వాహకులు అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఆధ్యాత్మికత,భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ కళలను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాల్లో యువత, గ్రామస్తులు మరింతగా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో యంనోని పల్లి భజన బృంద సభ్యులు,గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక జెడ్పీ హైస్కూల్ హెచ్.ఎం సస్పెన్షన్

నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్08(డీకే చాటింపు) : ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (గెజిటెడ్ హెచ్.ఎం) ఎ.శశికళను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల అలనత్వం వహించడంతో పాటు,ఎలాంటి అనుమతులు లేకుండానేపాఠశాలసామాగ్రిని విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, ఈ ఉదంతంపై ప్రాథమిక విచారణ జరిపించారు. ఈ సందర్భంగా పాఠశాల విధులకు హాజరుకాకుండానే హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్లు, సంబంధిత అధికారుల నుండి కానీ, పాఠశాల నిర్వహణ కమిటీ నుండి (ఎస్వీజ) ఎలాంటి అనుమతి లేకుండానే పాఠశాలలోని జనరేటర్, ఫర్నిచర్‌ను విక్రయించినట్లు, ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను కూడా విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో హెచ్.ఎం శశికళను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటా మని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు అక్షయ్ ఎంపిక..



బెల్లంపల్లి (డీకే చాటింపు)పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో బెల్లంపల్లి పట్టణం లోని యువ సంఘటన పాఠశాల విద్యార్థి అక్షయ్ రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు.అండర్ --14విభాగంలో అక్షయ్ ఎంపికయినట్లు పాఠశాల హెచ్ ఎం. ఏ.నవీన్ కుమార్, పిఈటి రవీందర్ తెలిపారు.

11 న బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా స్థాయి సదస్సు

జనగామ,అక్టోబర్ 8 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం--జనగామ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రమైన జనగామ నగరంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.బిసి ల కుల గణన రాజ్యాధికారం అనే అంశంతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్,విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.చిరంజీవులు ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమం అక్టోబర్ 11 వ తేదీన కెమిస్టు భవన్ లో నిర్వహించనున్నట్లు వివరించారు. జనగామ జిల్లాలో బీసీ మేధావులు, నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జిల్లాకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గద్ద అనిల్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాజశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి మారగోని సిద్ధయ్య గౌడ్, లింగాల ఘనపురం మండల అధ్యక్షులు వేముల (కోటి) రాజశేఖర్ తదితరులు పాల్గొననున్నారు.

బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ శుభారంభం

ప్రముఖ నటీమణి కుమారి వైష్ణవి చైతన్య చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభం





హైదరాబాద్, అక్టోబర్ 8 (డీకే చాటింపు) బాచుపల్లి, మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తమ 40వ స్టోర్ కు శుభారంభం చేసింది. ఈ నూతన స్టోర్‌లో దసరా, దీపావళి ప్రత్యేక కలెక్షన్స్‌లో భాగంగా కుటుంబంలో అన్ని తరాల వారి అభిరుచులను ప్రతిబింబించే సంప్రదాయ చీరెలు, పండగ అలంకరణ దుస్తులు, సరికొత్త డిజైన్స్ వంటి వైవిధ్యభరిత ఉత్పత్తులను సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నిర్వాహకులు ఒకేచోట విక్రయానికి అందుబాటులో ఉంచడం విశేషం. ప్రముఖ నటీమణి కుమారి వైష్ణవి చైతన్య జ్యోతిని వెలిగించి, రిబ్బన్ కత్తిరించడం ద్వారా ఈ సరికొత్త స్టోర్ శుభారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున షాపింగ్‌ప్రియులు విచ్చేసి, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుమారి వైష్ణవి చైతన్య మాట్లాడుతూ... బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తన చేతులమీదుగా శుభారంభం చేసుకోవడం ఆనందకర విషయం అన్నారు. ముఖ్యంగా దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా కుటుంబసభ్యుల అభిరుచులను ప్రతిబింబించే వైవిధ్యభరిత వస్త్రాలు ఈ సరికొత్త స్టోర్‌లో అందుబాటులో ఉండటం విశేషమని ఆమె అన్నారు. ఈ సరికొత్త స్టోర్స్ శుభారంభం సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యం వారు విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంత షాపింగ్‌ప్రియులకు హృదయపూర్వక స్వాగతం పలికి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పొట్టి వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ ఉ హోల్-టైం డైరెక్టర్ : విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతంలో 40వ స్టోర్‌ను ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా, మరెంతో గర్వకారణంగా ఉంది. ఈ ప్రాంతంలో షాపింగ్‌ప్రియుల కుటుంబాల సమాఖ్య పెద్ద ఎత్తున ఉండటం, వారి పర్వదిన అవసరాలకు, వివాహ వేడుకలకు సరితూగే వస్త్రాలను మేము అందజేయడం సంతోషదాయకం" అన్నారు. శీర్ణ రాజమౌళి, మేనేజింగ్ డైరెక్టర్‌లి : "దసరా, దీపావళి పర్వదినాలకు, వివాహ వేడుకలకు, కుటుంబసభ్యుల అందరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వారి అభిరుచులకు అనువైన వస్త్ర ఉత్పత్తులను హాయిగొలిపేలా, అత్యంత సౌకర్యంతో అందజేయడమే మా లక్ష్యం" అన్నారు. తిరువీధుల ప్రసాదరావు, హోల్-టైం డైరెక్టర్: "మీకు సంప్రదాయాన్ని ప్రతిబింబించే పట్టుచీరెలు కావాలన్నా, పండగ చీరెలు కావాలన్నా, క్యాజువల్ వేర్ కావాలన్నా, కుటుంబంలోని అన్నితరాల వారినీ మెప్పించే వెరైటీలు మా సరికొత్త స్టోర్‌లో ఉన్నాయి" అన్నారు. పవిత్ర దసరా, దీపావళి పర్వదినాలు, అదేవిధంగా వివాహాది శుభకార్యాల సందర్భంగా పూర్తి కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాచుపల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ అందిస్తున్న ప్రత్యేక కలెక్షన్లు: మహిళల కోసం: అందమైన కంచి పట్టుచీరెలు, ఫ్యాన్సీ చీరెలు, భారతదేశ వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందిస్తున్న కళాత్మక సమర్పణలు, పెళ్లికుమార్తెకు వన్నె తెచ్చే వైవిధ్యభరిత సంప్రదాయ వస్త్రాలు పురుషుల కోసం: అద్భుతమైన డిజైనర్ కుర్తాలు, సాంప్రదాయిక ఎత్నిక్ వస్త్రాలు, ఫార్మల్ సూట్స్, అధునాతన క్యాజువల్ స్టైల్స్ చిన్నారుల కోసం: ఆకర్షణీయమైన అందాల రంగుల్లో ఆకట్టుకునే ట్రెండీ ఫెస్టివల్ సూట్స్ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వారు బాచుపల్లిలోని మియాపూర్ రోడ్డు, అమీన్‌పూర్ లో సరికొత్తగా ప్రారంభించిన 40వ స్టోర్ కు విచ్చేసి... దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని పొందవలసిందిగా, ప్రారంభోత్సవ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవలసిందిగా... బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాలకు చెందిన షాపింగ్‌ప్రియులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు.



పత్తి రైతుల నిలువు దోపిడిపై జిల్లా కలెక్టర్ చర్యలు

-డీకే చాటింపు కథనానికి స్పందన... -రేపు ప్రత్యేక సమావేశం...



నారాయణపేట,(డీకే చాటింపు): పత్తి రైతుల సమస్యలపై డీకే చాటింపు దినపత్రికలో 'పత్తి రైతుల నిలువు దోపిడిపై అధికార పార్టీ నేత ఆవేదన..!'అనే శీర్షికన గురువారం వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పందించారు. ఈ అంశంపై చర్చించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.జిల్లాలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై డీకే చాటింపు దినపత్రికతో పాటు పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టారు.జిల్లా వ్యవసాయ అధికారి అఫీషియల్ డేటా ప్రకారం వానాకాలం 2026లో జిల్లాలో 1,68,491ఎకరాల్లో పత్తి సాగు,20,35,092 క్వింటాళ్ల దిగుబడి అంచనా. టాప్ మండలాలు ఉట్కూర్ (42,500 ఎకరాలు), మక్తల్ (30,000), కృష్ణా (18,600). ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,667 గా ఉండగా, పేపర్లలో రూ. 8,900 అని చూపిస్తున్నారు.కానీ రైతులకు నిజంగా వస్తున్నది రూ. 7,500 -8,000 మాత్రమే. అంటే ఎంఎస్ పి కన్నా రూ. 1,167 తక్కువ అందుతుందని నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేట మార్కెట్ ఆఫీసు అధికారుల నిర్వాకంతోనే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ద్వారా జిల్లాలోని పత్తి రైతులకు న్యాయం జరుగుతుందని పత్తి రైతుల తరఫున ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.



నేతన్నల ఇన్ స్టా బాట!

న్యూఢిల్లీ, : దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్‌ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు. వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు.విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్-కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పిఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి.దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ " అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మిమార్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి.మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు మామిడి గోపాల్ రెడ్డి



మహేశ్వరం, అక్టోబర్ 8(డీకే చాటింపు) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం లో భాగంగా ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లోని హుడా కాలనీ కమ్యూనిటీ హాల్లో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి అర్హులైన రేషన్ లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 యూత్ అధ్యక్షులు వరికుప్పల శివ తెలంగాణ స్టేట్ సెక్రెటరీ చరణ్ రెడ్డి సామిడి ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ ధరావత్ స్వామి నాయక్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు టెక్నోల కృష్ణ మరియు రాష్ట్ర నాయకులు లక్ష్మా చారి గడివేముల కృష్ణ నిమ్మల వెంకటేష్ లిగుడేటి లినరసింహా లోకేష్ చెర్రీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ఏసీబీకి పూర్తి స్థాయి స్వేచ్ఛ..

హైదరాబాద్: పుట్టల నుంచి పాములు బయటికి వస్తున్నాయి అనే విధంగా తెలంగాణలో అవినీతి అధికారుల బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో ఏసీబీ దాడులు ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా సాగుతున్నాయి. ఇన్నాళ్లుగా చిన్న స్థాయి అధికారుల మీద పడ్డ శాఖ ఇప్పుడు పెద్ద తలకాయల మీద దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏసీబీకి పూర్తి స్థాయి స్వేచ్ఛ ఇవ్వడంతో అధికారులు ఎవరిని వదిలిపెట్టకుండా దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేవలం సాధారణ తనిఖీలు కాకుండా పక్కా సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న లంచావతారాలను పట్టుకోవడానికి ఏకంగా ఒక పెద్ద వ్యూహాత్మక ఆపరేషన్‌ను ప్రారంభించారు.అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇప్పటివరకు ప్రధానంగా రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, ఎలక్ట్రిసిటీ, మున్సిపల్, పోలీస్ శాఖల మీదనే ప్రధానంగా దృష్టి సారించారు. ఈ దాడులలో పట్టుబడిన వారిలో ఎక్కువగా గ్రూప్ వన్, గ్రూప్ టూ కేడర్‌కు చెందిన అధికారులే ఉన్నారు. అయితే ఇప్పుడు క్షేత్రస్థాయి అధికారులతో పాటు ఏకంగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల అవినీతి బాగోతం మీద కూడా ఏసీబీ దృష్టి సారించినట్లు స్పష్టమైన సమాచారం వస్తోంది. ఇటీవల పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీ సంగిరెడ్డి భీమిరెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది. సరిగ్గా 2019 నాటి పాత కేసును మళ్లీ తవ్వి తీసిన పోలీసులు అతని అక్రమ సామ్రాజ్యాన్ని మొత్తం బట్టబయలు చేశారు. కేవలం ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఏకంగా నూట యాభై కోట్ల రూపాయలకు పైగా అక్రమ ఆస్తులను కూడబెట్టడం అందరినీ విస్మయానికి గురిచేసింది.ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసిన ఒక ఏఈ స్థాయి అధికారి కూడా నూట యాభై కోట్ల రూపాయలకు పైగా అక్రమ ఆస్తులతో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అయితే వీరంతా కూడా కేవలం బినామీలు మాత్రమేనని, అసలు సూత్రధారులు, పాత్రధారులు తెరవెనుక వేరే ఉన్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. కొంతకాలంగా కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరు తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. వారంతా నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఆస్తులు సంపాదించారనే పక్కా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు సమగ్రమైన వివరాలు సేకరించి రంగంలోకి దిగారు. అక్రమంగా సంపాదించిన అధికారుల చిట్టా మొత్తం సిద్ధం చేసుకున్న అధికారులు త్వరలోనే వారిని అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వరిణామాలు రాష్ట్ర బ్యూరోక్రసీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.తెలంగాణ అవినీతి నిరోధక శాఖ దాడుల వెనుక సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది.

కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వమోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విభేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

ఎన్టీయే హై పవర్ కమిటీ వర్క్ షురూ...

హైదరాబాద్ : ఇటీవల పేపర్ లీక్ వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించడంతో కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సంచలన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావులేకుండా పరీక్షా వ్యవస్థలో సాంకేతిక, నిర్మాణాత్మక సంస్కరణల కోసం వివిధ రంగాల నిపుణులతో హై-పవర్డ్ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియోలో స్పష్టం చేశారు.మొత్తం ఆరుగురు సభ్యులతో కలిపి కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్మన్‌గా టెక్ దిగ్గజం నందన్ నిలేకనినీ నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఎఃమాజీ డైరెక్టర్ తపన్ దేకా, మద్రాస్ ఎఐ డైరెక్టర్ కామకోటి, విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణులు అమృత్ లాల్ మీనా ఉన్నారు.కమిటీ ఛైర్మన్, సభ్యులు ప్రత్యేకులు నందన్ నీలేకని: ఈయన ప్రముఖ సాంకేతిక నిపుణుడు, ఆధార్ ప్రాజెక్ట్‌ను రూపొందించింది కూడా ఈయనే.. పరీక్షా విధానంలో డిజిటల్ భద్రత, అధునాతన



సాంకేతికత వినియోగంపై ఈయన పనిచేయనున్నారు.ఎస్. సోమనాథ్: ఈయన గతంలో ఇస్రో ఛైర్మన్‌గా దేశానికి సేవలు అందించారు. క్లిష్టమైన ప్రాసెస్ ఆటోమేషన్, సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌పై మార్గదర్శకత్వం సోమనాథ్ పనిచేయనున్నారు.తపన్ దేకా: ఈయన గతంలో ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ కమిటీలో ప్రశ్నాపత్రాల భద్రత, సైబర్ భద్రత, లీకేజీల నివారణపై పనిచేయనున్నారు.ప్రొఫెసర్ వి. కామకోటి: ఈ ఎఐ మద్రాస్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు.

వివాదాల్లో సెలబ్రిటీ..?

హైదరాబాద్, : పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు.. ప్రతిష్టకు ప్రతిష్ట.. గౌరవానికి గౌరవం.. ఇంకా చాలా .. వీటన్నింటినీ మన సమాజం వీళ్లకు భారీగానే ఇచ్చింది. పేరూ ఊరూ తెలియకపోయినప్పటికీ నెత్తిన పెట్టుకుంది. సెలబ్రిటీ అనే హోదా ఇచ్చింది. కానీ ఎంతో ఇచ్చిన సమాజానికి వీళ్ళు రిటర్న్ గిఫ్ట్ ఏమిచ్చారో తెలుసా..సెలబ్రిటీలు వివాదాలలో చిక్కుకోవడం మన తెలుగు రాష్ట్రాల్లో కొత్త కాదు. కాకపోతే గతంలో మీడియా ఈ స్థాయిలో లేదు కాబట్టి వాళ్ల గురించి అంతగా తెలిసేది కాదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా బలంగా ఉంది. ఇలాంటప్పుడు సెలబ్రిటీలు జాగ్రత్తగా ఉండాలి. ఎంతో ఇచ్చిన సమాజం పట్ల అప్రమత్తంగా ఉండాలి. తాము చేసే అడుగులను సమాజం జాగ్రత్తగా గమనిస్తోంది అనే సోయి ఉండాలి. ఇది లేకపోతే సెలబ్రిటీలు బొక్కా బోర్లా పడడం ఖాయం. అలా బొక్కా బోర్లా పడి పరువు పోగొట్టుకున్న సెలబ్రిటీల జాబితా ఇప్పుడు ఏంటో చూద్దాం. గతంలో సినిమాలలో నటించేవారిని మాత్రమే సెలబ్రిటీలుగా పరిగణించేవారు. కానీ ఇప్పటి కాలంలో టెలివిజన్.. గాయకులు.. డ్యాన్సర్లు.. సోషల్ మీడియాలో ప్రభావం చూపించగలిగే వారిపై మన సమాజం సెలబ్రిటీ ముద్ర వేసింది. వారందరికీ ఎన్నో రకాలుగా మన సమాజం చేయూత అందిస్తూనే ఉంది. కాకపోతే వారు సమాజం నుంచి భారీగా స్వీకరించి.. చివరికి ఏదో ఒక వివాదంలో చిక్కుకొని పరువు పోగొట్టుకుంటున్నారు.

మంగ్లీ

తెలుగు జానపద.. సినీ గాయనిగా.. టెలివిజన్ యాంకర్ గా.. విలక్షణమైన గొంతుతో.. సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి.. ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో తెలుగు రాష్ట్రాలలో విశేషమైన గుర్తింపు పొందారు మంగ్లీ. ఈమె అసలు పేరు సత్యవతి రాథోడ్. జూన్ 10, 1994 లో అనంతపురం జిల్లా గుత్తి మండలం బచ్చినపల్లి తండాలో ఒక సాధారణ నిరుపేద బంజారా కుటుంబంలో జన్మించారు ప్రాథమిక విద్యను తండాలో పూర్తీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ సమయంలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆమెలో ప్రతిభను గుర్తించి సంగీతం నేర్చుకునేందుకు ఆర్థిక సహాయం అందించింది. బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, ఉగాది, సమ్మక్క సారక్క వంటి ప్రత్యేక సందర్భాలలో ఆమె పాడిన పాటలు యూట్యూబ్ లో సంచలనం సృష్టించాయి. టాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాలలో ఆమె పాటలు పాడారు. అలవైకుంఠపురం అనే సినిమాలో రాములో రాములా.. పుష్ప.. బలగం.. ది ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో ఆమె పాడిన పాటలు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చాయి. తెలుగులోనే కాకుండా.. కన్నడలో కూడా ఆమె పాటలు పాడారు 2021లో మాస్ట్రో.. 2018లో శైలజా రెడ్డి అల్లుడు.. 2020లో గువ్వా గోరింక అనే సినిమాలలో ఆమె నటించారు. 2020లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు ఉత్తమ జానపద కళాకారిణి అనే పురస్కారం అందించింది. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్.. ఐఫా ఉత్సవం అవార్డులను ఆమె సొంతం చేసుకున్నారు.. 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యేక సలహాదారుగా నియమించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మంగ్లీ 2026 ఏప్రిల్ నెలలో సుమారు 200 కోట్ల మైక్రో ఫైనాన్స్ కుంభకోణానికి సంబంధించిన వివాదంలో కూరుకుపోయారు. అయితే ఇందులో తనకు.. తన కుటుంబానికి ఎటువంటి ప్రమేయం లేదని మంగ్లీ వివరించారు. ఇందులో రమావత్ మధు అనే వ్యక్తి ఇంట్లో ఒకపూట భోజనం చేసినందుకు తనను ఇబ్బంది పెట్టారని.. రకరకాల ఆరోపణలు చేశారని ఆమె వాపోయారు. దీని వెనక ఎవరి పాత్ర ఉంది.. ఎవరి చేయి ఉంది అనే విషయం పక్కన పెడితే మంగ్లీ తీవ్రమైన వివాదంలో కూరుకుపోయారు. ఇన్ని రోజులపాటు సంపాదించుకున్న మంచి పేరును పోగొట్టుకోవాల్సి వచ్చింది..

మాధురి రాథోడ్

తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈమె ప్రముఖ జానపద నృత్య కారిణిగా పేరు తెచ్చుకుంది. ఇటీవల మరో ఫోక్ డాన్సర్ ఈశ్వర్ సాయితో కలిసి ఉన్నప్పుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. ఈశ్వర్ సాయి భార్య వేములవాడలో మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయిని పట్టుకుంది. ఈశ్వర్ సాయి.. మాధురి రాథోడ్ ఒకే గదిలో ఉండగా ఈశ్వర్ సాయి భార్య శరణ్య వారిద్దరిని పట్టుకున్నట్టు ఒక వీడియో సోషల్ మీడియాలో ఇప్పటికీ సంచలనం సృష్టిస్తోంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య తన మీద ఆకారణంగా దాడి చేసి బూతులు తిట్టిందని.. తన ఐఫోన్ లాక్కుని వెళ్లిందని.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందని మాధురి మొదట వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని ఈశ్వర్ సాయి మోసం చేశాడని మాధురి రాథోడ్ హైదరాబాదులో నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.కేసు పెట్టి రోజులు అవుతున్నప్పటికీ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం పట్ల.. మాధురి ఆగ్రహం వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరగడం లేదని మనస్తాపంతో హైదరాబాదులోని పుప్పాలగూడలో తన ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారు. మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయి మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ.. మొతానికి ఈ వివాదం ద్వారా మాధురి రాథోడ్ చాలావరకు అవకాశాలను కోల్పోయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తనకు న్యాయం జరగాలని మాధురి రాథోడ్ ఇప్పటికి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉంది.

ఈశ్వర్ సాయి

కేవలం మాధురి రాథోడ్ మాత్రమే కాకుండా ఈశ్వర్ సాయి కూడా ఈ వివాదంలో పీకలలోతు కూరుకుపోయాడు. బాసింగ బలాలు అనే పాట ద్వారా ఏ స్థాయిలో అయితే గుర్తింపు తెచ్చుకున్నాడో .. మాధురి రాథోడ్తో రెడ్ హ్యాండెడ్ గా దొరికి అదే స్థాయిలో తన పరువు పోగొట్టుకున్నాడు. ఇప్పట్లో అతడు ఫోక్ సాంగ్స్ లో కనిపించడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఇప్పటికే అతడు మాధురి రాథోడ్



పోలీసులకు చేసిన ఫిర్యాదులు నేపథ్యంలో అజ్ఞాతంలో ఉన్నాడు. ఒకవేళ అతడు బయటికి వస్తే పోలీసులు అరెస్ట్ చేస్తారు. బెయిల్ మీద బయటకు వచ్చినప్పటికీ ఒకప్పటిలాగా ఈశ్వర్ సాయికి సొసైటీలో గౌరవం ఉండదు. పైగా ప్రొడ్యూసర్లు కూడా ముందుకు రారు.

మధుప్రియ

తెలంగాణ ఉద్యమంలో పాటలు పాడి ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకుంది మధుప్రియ. ఆడపిల్లనమ్మా నేను ఆడపిల్లనంటూ పాడిన ఒక పాట ఆమెకు తిరుగులేని స్థాయిని అందించింది. అయితే ఆమె కాలేశ్వరం ఆలయంలో గర్భగుడిలో ఒక ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ షూటింగ్ చేయడం తీవ్రమైన వివాదానికి దారి తీసింది. సాధారణంగా కాలేశ్వరం ఆలయంలో గర్భగుడిలోకి మొబైల్ ఫోన్లు.. కెమెరాలకు అనుమతి ఉండదు. అలాంటిది మధుప్రియ బృందం ఏకంగా కెమెరాలతోనే గర్భగుడిలో షూటింగ్ చేయడం పట్ల హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బిజెపి నాయకులు కూడా తీవ్రస్థాయిలో ఆమె మీద మండిపడ్డారు. మరోవైపు నాడు మధుప్రియ చేసిన పనికి ఆలయ పూజారికి దేవాదాయ శాఖ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. మధుప్రియ 2015లో తన తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా శ్రీకాంత్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పట్లో ఈ వ్యవహారం మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. వివాహం జరిగిన కొద్ది రోజులకే తన భర్త శ్రీకాంత్ అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని మధుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. చివరికి పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత వారిద్దరూ విడాకులు తీసుకున్నారు.

మరోవైపు ఇటీవల రేవంత్ రెడ్డి పై కూడా మధుప్రియ సంచలన వ్యాఖ్యలు చేసింది. తాను కేవలం కేసీఆర్ కు మాత్రమే పాటలు పాడతానంటూ వ్యాఖ్యానించింది. దీని పట్ల కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా సొసైటీలో ఎంతో పేరు తెచ్చుకొని.. మంచి స్థానంలో ఉన్న సెలెబ్రిటీలు ఏదో ఒక వివాదంలో చిక్కుకొని.. మొత్తానికి తమ స్థాయిని కోల్పోయారు. గౌరవాన్ని తగ్గించుకున్నారు. అందువల్లే ఇప్పుడున్న సెలబ్రిటీలకు.. సెలబ్రిటీగా మారబోతున్న వాళ్లకు వీళ్ళు ఎప్పటికీ ఒక గుణపాఠం లాగా మిగిలిపోతారు.

జీఓ నెంబర్ 97 రద్దు కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన

సికింద్రాబాద్ : జీఓ నెంబర్ 97 రద్దును కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలశాల విద్యార్థులు చేస్తున్న నిరసన నేటికి 26వ రోజుకు చేరుకుంది. సికింద్రాబాద్ లోని పాలిటెక్నిక్ కాలశాల విద్యార్థులు జీఓ.97 రద్దును ఆంగ్ల అక్షరాలతో నూచిస్తూ బైఠాయించి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ పుస్తకాల బ్యాగ్ లను మధ్యలో బతుకమ్మల మాదిరిగా ఉంచి చుట్టూ తిరుగుతూ, శక్తి స్కీం కు వ్యతిరేకంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ ఉద్యమాన్ని చేపట్టి 25రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రావడం లేదని, తమ బవిష్యత్తుతో ఆటలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుండి తప్పకుండా సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్ పై షాద్ నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన దానం నాగేందర్



హైదరాబాద్ : షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసిఆర్ పై చేసిన వ్యాఖ్యలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. తక్షణమే కేసీఆర్ కి క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సేవలు ఈ రాష్ట్రానికి అవసరం ఉందని , ఆయన అనుభవం ప్రజలకు అందించాలని అన్నారు. కేసీఆర్ చనిపోవాలని ఓ ఎమ్మెల్యే కోరుకోవడం... ఆయన స్థాయికి ఆ మాటలు మాట్లాడటం సబబుకాదన్నారు. రాజకీయంగా ఉన్నప్పుడు రాజకీయంగానే మాట్లాడాలే కానీ వ్యక్తిగతంగా చనిపోవాలి అని కోరుకోవడం దారుణం అన్నారు. కేసీఆర్ నిండునూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని తాను భగవంతుడుని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేసీఆర్ గురించి చెడు కోరుకుంటే , తమకే చెడు జరుగుతుందన్నారు. అలాగే స్పీకర్ తల్లిని అవమానకరంగా మాట్లాడిన ఎమ్మెల్సీ ఆయనకు క్షమాపణలు చెప్పాలని దానం సూచించారు.

నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది

-మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచాం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ విద్యా విధానంపై సభలో చర్చ జరగడం ఒక శుభ పరిణామం. సభ్యుల సూచనలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. దేశ తొలి ప్రధాని నెహ్రూ గారు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండు అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం అయన శాసనసభలో మాట్లాడారు. దేశంలోని ఏ విద్యా సంస్థ అయినా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైంది. ఇప్పుడున్న చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినవే. విద్య ఒక్కటే మన జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందని సంపూర్ణంగా నమ్ముతున్నా . రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీపెక్ సర్వే నిర్వహించింది. సామాజిక వెనుకబాటుకు ఆస్తులు అంతస్తులు కాదు? విద్య లేకపోవడమే సామాజిక వెనుకబాటు తనానికి కారణమని సర్వేలో తేలింది. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్య విధానంలో తీసుకు రావాల్సిన అంశంపై చర్చించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ నూతన విద్యా విధానం రూపొందించేందుకు విద్య కమిషన్ ను ఏర్పాటు చేశాం. విద్యా కమిషన్ అందించిన రిపోర్ట్ ను పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో ఒక కమిటీని నియమించాం . మీ సూచనలు, సలహాలను కేశవరావు గారికి అందిస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉంది. విద్య కోసం 15 శాతానికి బడ్జెట్ ను పెంచడమే మా లక్ష్యం. పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రి లేడని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అంటున్నారు. ముఖ్యమంత్రి ఆ శాఖను నిర్వహిస్తున్నారంటే ఆది అత్యంత ప్రధానమైనదని అర్థం. ముఖ్యమంత్రిగా నేను ఎడ్యుకేషన్ సమీక్ష చేస్తే మొత్తం సిస్టమ్ వచ్చి సమీక్షలో ఉంటుంది. ఈ మాత్రం తేడా కూడా సభ్యుడికి తెలియకపోవడం బాధాకరమని అన్నారు. నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది. 2023-24 బడ్జెట్ లో బీఆరెస్ ప్రభుత్వం విద్యా శాఖ కు రూ. 19,093



కోటల కేట్లయిస్తే.. మా ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ. 21,292 కోట్లు కేటాయించింది . 2025-26 బడ్జెట్ లో ఆ మొత్తాన్ని రూ. 23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ. 26,647 కోట్లకు పెంచాం. కేవలం మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ. 7,554 కోట్లకు పెంచాం. మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 రోజుల్లోనే 10,006 మంది టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశాం చిన్న ఆరోపణ లేకుండా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశాం. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7857 మంది టీచర్లను నియమించారు. జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరానికి కూడా దృష్టిలో ఉంచుకుని విద్యా విధానం తీసుకొస్తున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, తలరాతలు మార్చేది విద్యా అని నమ్మి విద్యా శాఖ నా దగ్గర పెట్టుకున్నా నని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం . కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు చేసినపుడు కొన్ని వివాదాలు జరుగుతాయి . అలాంటిదే పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం. 97 . నేను విద్యా శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్నాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మంది పెరిగారు. ఇది విద్యా శాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనమని అన్నారు.

ప్రజ్వల్ ఫోన్ లో పోర్న్ వీడియోలు

బెంగళూరు : మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వందలాది పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నిర్ధారించింది. మొత్తం 173 వీడియో ఫైళ్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాటిలో ప్రజ్వల్‌కు సంబంధించినవిగా భావిస్తున్న మూడు అశ్లీల వీడియోలు ఉన్నట్లు సమాచారం.బెంగళూరు కేంద్ర కారాగారంలో ఆగస్టు 11న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రజ్వల్ రేవణ్ణ, మరో ఖైదీ ప్రతాప్ రాయ్ ఉంటున్న గదిలో మొబైల్ ఫోన్ దొరికింది. పాస్‌వర్డ్ చెప్పేందుకు ఇద్దరూ నిరాకరించడంతో ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. తాజాగా వచ్చిన నివేదికలో వీడియో ఫైళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది.మొబైల్‌లో కన్నడ, హిందీ, ఇంగ్లిష్ సినిమాల క్లిప్పులు, వెబ్‌సిరీస్ వీడియోలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పెన్‌డ్రైవ్‌లోనూ 150కి పైగా వీడియోలు ఉన్నట్లు వెల్లడైంది. వాటినీ అధికారులు పరిశీలిస్తున్నారు.ఫోన్‌లో వాట్సాప్, వీడియో కాల్స్ జరిగినట్లు కాల్ రికార్డుల పరిశీలనలో తేలింది. పలువురు మహిళలతో సంప్రదింపులు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజ్వల్‌తో గతంలో కొన్ని వీడియోల్లో కనిపించిన కొందరు మహిళలతో జరిగిన కాల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అవసరమైతే వారికి నోటీసులు ఇచ్చి ప్రశ్నించే అవకాశం ఉంది.జైలులో ఉన్న సమయంలో ప్రజ్వల్ కుటుంబ సభ్యులతో తరచూ మాట్లాడినట్లు దర్యాప్తులో తేలింది. తన న్యాయవాదితోనూ ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు.ఇక హైసెక్యూరిటీ జైలులోకి ఫోన్ ఎలా చేరిందన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఓ జైలు వార్డర్ ప్రజ్వల్‌కు ఫోన్ అందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. తౌసీఫ్ అనే రౌడీషీటర్ పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. డిజిటల్ ఆధారాలు, కాల్ రికార్డులు, జైలు సిబ్బంది వాంగ్మూలాలతో దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

సౌత్ లీడర్ గా భారత్

న్యూఢిల్లీ, : ప్రస్తుత సమయంలో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ రాజకీయాల్లో అనిశ్చితి నెలకొంది. దీంతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త, ప్రత్యామ్నాయ వేదిక అవసరం. దక్షిణాసియా వ్యవహారాల నిపుణుడు మైఖేల్ కుగెల్‌మాన్ ప్రకారం, 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ద్వారా భారత్‌కు తన గ్లోబల్ లీడర్‌షిప్ సామర్థ్యాన్ని మళ్లీ బలపరుచుకునే అవకాశం ఉంది. భారత్‌కు అతిపెద్ద సవాలు పశ్చిమ ఆసియాలోని ఉద్రిక్తతలు, కొందరు సభ్యుల అమెరికా వ్యతిరేక వైఖరి మధ్య బ్యాలెన్సింగ్ సాధిస్తూ అందరినీ ఏకాభిప్రాయానికి ఒప్పించడం.. తద్వారా ఒక సంయుక్త ప్రకటనను చేయాలి. గ్లోబల్ అస్థిరత కాలంలో విశ్వసనీయ పరిష్కారాలను భారత్ నిరంతరం అందిస్తోంది. నేడు అనిశ్చితి సమయంలో గ్లోబల్ సంస్థలు బలహీనపడుతున్న వేళ, భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాలకు దృఢమైన, ప్రాయోగిక పరిష్కారాలను అందిస్తోంది. కరోనా మహమ్మారి, ఆర్థిక సంక్షోభ సమయంలో భారత్ అనేక దేశాలకు వ్యాక్సిన్లు, ఆహార ధాన్యాలు, అత్యవసర వైద్య సహాయం అందించింది. నేడు భారత్ మిడిల్ ఈస్ట్ నుంచి ప్రపంచంలోని ఇతర దేశాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలను మధ్యవర్తిత్వం ద్వారా తగ్గించగలదు. ఎందుకంటే అన్ని దేశాలతోనూ భారత్‌కు మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి.విదేశాంగ విధాన ప్రాధాన్యతలను అగ్రస్థానంలో ఉంచడం భారత్ తన దౌత్యానికి కేంద్రంగా చేసుకుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధి, ప్రాధాన్యతలు, ఆకాంక్షలను భారత్ ప్రాముఖ్యంగా చూసింది. భారత్ తన జీ-20 అధ్యక్షత సమయంలో ఆఫ్రికన్ యూనియన్ (ంజ)ను శాశ్వత సభ్యుడిగా చేర్చుకోవడంలో కీలక పాత్ర పోషించింది. దీంతో గ్లోబల్ సౌత్‌కు ప్రపంచ వేదికపై ప్రత్యక్ష ప్రాతినిధ్యం లభించింది. భారత్ మరోసారి అందరినీ కలుపుకుని ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉంది.విభిన్న, పరస్పర విరుద్ధ వైఖరులు కలిగిన దేశాల సమూహంలో ఏకాభిప్రాయం తీసుకురావడం భారత్ దౌత్య నైపుణ్యాన్ని స్పష్టం చేస్తుంది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సమయంలో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో రష్యా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు వంటి అంశాలపై విభజిత దేశాల మధ్య 'న్యూ ఢిల్లీ డిక్లరేషన్' లేదా సంయుక్త ప్రకటనలపై ఏకాభిప్రాయం సాధించడం పెద్ద విజయం అవుతుంది. సంక్లిష్ట భౌగోళిక, రాజకీయ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏదో ఒక దేశానికి వంత పాడకుండా భారత్ అన్ని పక్షాలతో మధ్యస్తంగా ఉంటూ స్వతంత్రంగా పనిచేస్తోంది. ఒకవైపు అమెరికా, పాశ్చాత్య దేశాలతో సన్నిహిత వ్యూహాత్మక, రక్షణ సంబంధాలు కొనసాగించడం ముఖ్యం. అదే సమయంలో బ్రిక్స్ వేదికపై రష్యా, ఇతర దేశాలతో ఇంధన, వాణిజ్య సహకారాన్ని కొనసాగించడం అద్భుతమైన వ్యూహంగా చెప్పవచ్చు.గ్లోబల్ సప్లై చైన్ అడ్డంకులను తొలగించేందుకు సురక్షిత, ప్రత్యామ్నాయ వాణిజ్య కారిడార్లను సిద్ధం చేయడంలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. భారత్ మధ్యప్రాచ్యం- యూరప్ ఆర్థిక కారిడార్ (ఎఓఇఅ) వంటి కార్యక్రమాల ద్వారా వాణిజ్య మార్గాలను బలోపేతం చేస్తూ, ఇతర దేశాలపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించాలని భావిస్తోంది.సముద్ర మార్గాలు, కీలక జలసంధులను (హర్ముజ్ లాంటి) సురక్షిత మార్గాలుగా ఉంచి అభివృద్ధి చెందుతున్న దేశాల దిగుమతి-ఎగుమతులను సజావుగా కొనసాగించాలని భారత్ భావిస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత నౌకాదళం 'ఫస్ట్ రెస్పాండర్' పాత్ర పోషించడం, ఎర్ర సముద్రం, హర్ముజ్ సమీపంలో వాణిజ్య నౌకలకు సముద్ర దొంగలు లేదా దాడుల నుంచి రక్షణ కల్పించడం ప్రశంసనీయం.భారత్ తన స్వదేశీ టెక్నాలజీ, డిజిటల్ మోడల్ (ఇండియా స్టాక్, జఖఎ, డిజిలాకర్ వంటి)లను శ్రీలంక, కెన్యా వంటి ఆసియా, ఆఫ్రికా దేశాలతో పంచుకుంటోంది. ఈ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక సమగ్రతను పెంచడంతో పాటు, అవి అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతున్నాయి.యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ (జఔఅ), ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ వంటి పాత గ్లోబల్ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలపై తరచుగా నిర్లక్ష్యంగా ఉంటారు. ఈ సంస్థల్లో సంస్కరణల కోసం డిమాండ్ చేస్తూ ముఖ్యంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి గ్లోబల్ సౌత్ దేశాలకు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని బలంగా సమర్థిస్తూ, భారత్ నిజంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు బలమైన గొంతుకగా మారుతోంది. బ్రిక్స్ వంటి వేదికలు పాశ్చాత్య- వ్యతిరేక సంస్థలుగా మారకుండా కేవలం వ్యూహాత్మక అభివృద్ధి, సౌత్- సౌత్ కోఆపరేషన్ పై ఫోకస్ చేయాలి. భౌగోళిక- రాజకీయ ఉద్రిక్తతలున్నప్పటికీ పరస్పర వాణిజ్యం, స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు (లోకల్ కరెన్సీ సెటిల్‌మెంట్), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు కఠిన నిబంధనలు లేకుండా ఆర్థిక సహాయం అందించడంపై ఫోకస్ చేయాలిముఖ్యంగా ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ ఒకే బ్రిక్స్ వేదికలో ఉండటం ఈ చర్చలను మరింత క్లిష్టంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధాలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ దేశాల మధ్య ఉన్న విభేదాలను అధిగమించి ఏకాభిప్రాయం సాధించడం పెద్ద దౌత్య సవాలుగా మారింది.ఇరాన్, యూఏఈ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మేలో జరిగిన బ్రిక్స్ మంత్రివర్గ సమావేశం తొలిసారి సంయుక్త ప్రకటన లేకుండానే ముగిసింది. అప్పట్లో భారత్ ఛైర్ స్టేట్‌మెంట్, ఔట్‌కమ్ డాక్యుమెంట్‌ను మాత్రమే విడుదల చేసింది. ఈసారి మాత్రం సంయుక్త ప్రకటనకు సభ్య దేశాలు అంగీకరించాయి.ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ యుద్ధానికి బదులుగా చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనాలని పదేపదే చెబుతోంది. జీ20 అధ్యక్ష బాధ్యతల సమయంలో అనుసరించిన విధంగానే బ్రిక్స్‌లోనూ భారత్ గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళుతూ పశ్చిమ దేశాలకు వ్యతిరేక వేదికగా బ్రిక్స్‌ను మార్చకుండా బ్యాలెన్స్‌డ్ వైఖరిని కొనసాగిస్తోంది.

చంద్రబాబు, సత్యకుమార్‌పై నడ్డా ప్రశంసల జల్లు

-"ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం సురక్షిత చేతుల్లో ఉంది"

-చంద్రబాబు నాయకత్వం.. సత్యకుమార్ కృషిపై పూర్తి విశ్వాసం ఉందన్న కేంద్ర మంత్రి



ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో సురక్షిత చేతుల్లో ఉందని కేంద్ర ఆరోగ్య, రసాయనాలు?ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ప్రశంసించారు. నూతన క్రిటికల్ కేర్ బ్లాకులు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను నడ్డా అభినందించారు. చంద్రబాబు నాయకత్వంపై, సత్యకుమార్ కృషిపై తనకు పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. వారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో దేశంలోనే ముందంజలో నిలుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వ్యాధుల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తీరును కేంద్ర మంత్రి అభినందించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు.చంద్రబాబు నాయకత్వానికి కితాబుము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కొత్త దిశను చూపిస్తున్నాయని నడ్డా పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు. సత్య కుమార్ చొరవ పై విశ్వాసం ఆరోగ్యశాఖను సమర్థంగా ముందుకు నడిపిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషిని కూడా నడ్డా ప్రత్యేకంగా అభినందించారు.

బంధం... బలపడుతోంది..!

విజయవాడ: ఏపీలో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. మూడు పార్టీల కూటమి ఒక వైపు.. మరోవైపు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ మూడు పార్టీల మధ్య బంధం స్ట్రాంగ్ గా ఉంది. అలా ఉన్నంతవరకు ఆ కూటమిని వైసిపి ఏం చేయలేదు అనేది మెజారిటీ విశ్లేషకుల భావన. అయితే ఐక్యం అనేది ఆ మూడు పార్టీల ఇష్టం. వైసిపి గెలవాలి అనుకున్నవారు కూటమి విచ్ఛిన్నం కావాలని కోరుకుంటారు. మెజారిటీ వైసీపీ శ్రేణులు కోరుకునేది అదే. అందుకే ఆ మూడు పార్టీల మధ్య విభూతానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, లోకేష్ల మధ్య గట్టి తగాదా రావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ రోజు రోజుకి వారి మధ్య బంధం పెరుగుతూనే ఉంది కానీ.. తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో నారా లోకేష్ చేసిన ప్రకటన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ఈరోజు. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీల శ్రేణులు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే అందరికంటే నారా లోకేష్ శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలిచాయి. సినీ అభిమానుల దృష్టిలో పవర్ స్టార్.. జనసైనికుల దృష్టిలో సేనాని.. నాకు మాత్రం దేవుడు ఇచ్చిన అన్న పవన్ అంటూ సంబోధించారు నారా లోకేష్. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆ పార్టీ మీడియాతో పాటు సోషల్ మీడియా ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తున్నాయి.పవన్ కళ్యాణ్ విషయంలో లోకేష్ మాత్రం చాలా ప్రత్యేకంగా చూస్తుంటారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత. లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ వారిద్దరి మధ్య బంధం బాగానే ఉంటుంది. అది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించదు. అందుకే లోకేష్ పవన్ విషయంలో స్పందించిన ప్రతిసారి వైసీపీకి ఎక్కడలేని కోపం. వారు భాగస్వామ్య పార్టీల అధినేతలు. ఆ పైవారు పరస్పరం గౌరవించుకుంటున్నారు కానీ ఈ విషయంలో ఎందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా రియాక్ట్ అవుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం వైసీపీ అనుకూల మీడియాతో పాటు సోషల్ మీడియాలో.. పవన్ కళ్యాణ్ ను ఆకాశానికి ఎత్తేస్తున్న లోకేష్ అంటూ శీర్షికలు పెట్టి కథనాలు రాస్తున్నారు. వాళ్లు స్నేహితులు. వారు చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అసలు ఈ విషయంలో వైసీపీకి ఎందుకు అంత ఉత్సాహం? అంటే వారు కలిసి ఉంటే తనకు సుఖం ఉండదు. తనకు విజయం దక్కాలంటే వారు కలిసి ఉండకూడదు. కానీ వారి మధ్య బంధం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు.



జెన్ జీ జపంలో జనసేనాని

ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ పుట్టినరోజు సందర్భంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జనసేన. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం పేరును 'జై కొట్టు' గా నామకరణం చేసింది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నూతన విభాగం 'జై కొట్టు'ను ఆవిష్కరించారు. జై కొట్టు పేరుతో ప్రత్యేకంగా ఒక పాటను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ పాట షేక్ చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకాయి.పవన్ కళ్యాణ్ గత కొద్దిరోజులుగా కేరళలో ఉంటున్న సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అక్కడ ప్రకృతి వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. అందుకే తన జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా పవన్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఎక్కడికక్కడే బైక్ ర్యాలీలు చేపడుతున్నారు.. ఆలయాల్లో పూజలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనసేనకు ముఖ్యంగా యువత బలం అధికం. అందుకే ఆ పార్టీ యువజన విభాగానికి ప్రత్యేక నామకరణం చేయాలని భావించారు. అందుకు పవన్ పుట్టినరోజు వేడుకలను వేదికగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ జన్మదిన వేడుకల్లో పార్టీ యువజన విభాగానికి జై కొట్టు అనే ప్రత్యేక పేరును పెట్టారు.మరోవైపు ఈ జై కొట్టు అనే నినాదానికి.. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పాత తోడైంది.' జై కొట్టు' పేరుతో ప్రత్యేకంగా పాటను కూడా విడుదల చేశారు. ఈ పాటకు ధమన్ మ్యూజిక్ అందించారు.. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోయారు. అందుకే ఆయన ఆడియో మెసేజ్ పంపించారు. చెయ్యెత్తి జైకొట్టు నినాదం అందర్నీ ఆకట్టుకుంటుందని మనోహర్ అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తిని అందించాలనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ లోగోను తీసుకొచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. జై కొట్టు నినాదంతో యువత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు



నెల్లూరు: ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి. బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు.సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు-ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుదు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బొప్పరాజు ప్రకటించిన ఉద్యమంతో తమకు సంబంధం లేదని మిగతా సంఘాల నేతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏపీ జేఏసీ కూడా సొంతంగా పనిచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయని అంటున్నారు.

ఏకగ్రీవానికి నో అగ్రీ..!



విజయవాడ, : ఏకగ్రీవం వద్దు అని మరోసారి స్పష్టం చేశారు వైసీపీ చీఫ్ వైఎస్ జగన్. అది కూడా తన సొంత జిల్లా సొంత ప్రాంతం పులివెందుల వేదికగా ఆయన బిగ్గర స్వరం వినిపించారు. ఏకగ్రీవాలు అన్న మాటే వద్దు అని వైసీపీ లీడర్ ని క్యాడర్ ని ఆదేశించారు. ప్రతీ చోటా వైసీపీ పోటీ చేసి తీరాల్సిందే అని కూడా జగన్ గట్టిగానే దిశా నిర్దేశం చేశారు. దాంతో ఏపీలో ఏకగ్రీవాల విషయంలో బిగ్ వార్ కూటమి వర్సెస్ వైసీపీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకే రోజున అటు ప్రభుత్వ అధినేత చంద్రబాబు ఏకగ్రీవాలు అన్నవి అవసరమని ఆహ్వానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సభలో బాబు ఏకగ్రీవాల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దానికి ధీటుగా పులివెందుల నుంచి జగన్ పోటీ ఉండాల్సిందే అంటున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ నేతలు అంతా ఒక చాలెంజ్ గా తీసుకోవాలని జగన్ కోరారు. ఆయన పులివెందులలో పార్టీ నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు ఎక్కడా ఏకగ్రీవం అన్నదే వద్దు, దానికి అసలు చాన్స్ ఇవ్వవద్దు అని చెప్పారు. ప్రతీ చోటా ప్రతీ సీటుకూ వైసీపీ పోటీ పడి తీరాల్సిందే అని కూడా జగన్ అన్నారు. ఇక అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చినా లేదా పోలీసులను ప్రయోగించినా దౌర్జన్యాలకు పాల్పడినా కూడా వైసీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ కోరారు. భయపడకండి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని జగన్ భరోసా ఇచ్చారు. అంతే కాదు వైసీపీ హయాంలో జరిగిన మేలుని, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఏకగ్రీవాలు మేలు అని గ్రామ స్థాయిలో కక్షలు కార్పణ్యాలకు తావు లేకుండా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని కూడా ఆయన వివరంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవాలు అన్నవి గతంలో జరిగినవే అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుకు తెస్తున్నారు. ఇక అధికారంలో ఏ పార్టీ ఉంటే వీలుగా ఏకగ్రీవాలు చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. అలాంటిది అసలు ఏకగ్రీవం అన్న మాటే వినిపించకూడదని జగన్ ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. అంటే పోటీకి వైసీపీ సై అంటోంది. అలాంటి పరిస్థితి ఉంటే కనుక అది గ్రామ స్థాయిలో కానీ పల్లెలలో కానీ ఒక రాజకీయ సమరానికే దారి తీస్తుందని అంటున్నారు. ఢీ అంటే ఢీ అంటూ రాజకీయం సాగి ప్రశాంత వాతావరణం వేడెక్కిపోతుంది అని అంటున్నారు.నిజంగా పోటీకి మరో పక్షం సిద్ధంగా ఉంటే అది ప్రజాస్వామిక విధానంగా చూడాలి. అలా కాకుండా పోటీని అనివార్యం చేయడం తగదన్న మాట వినిపిస్తోంది. అలాగే పోటీకి సిద్ధంగా ఎవరైనా ఉంటే ఏకగ్రీవం పేరుతో వారి గొంతు నొక్కే తీరు మంచిది కాదని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ అంతటా ఒకేలా రాజకీయం ఉండదు, స్థానికంగా ఉండే పరిస్థితుల బట్టి అది మారుతూ ఉంటుంది. అందువల్ల ఏకగ్రీవాలు వద్దు అని వైసీపీ బిగ్ సౌండ్ చేసినా అలాగే కావాలని కూటమి కోరినా అది స్థానిక పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఎక్కడికక్కడ లోకల్ గా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన ఎన్నికలను ప్రతిష్టగా మార్చాలనుకుంటే భీకర పోరుకు నాంది పలికినట్లు అవుతుందని అంటున్నారు.

డీఎస్సీపై జగన్ ప్రశ్నలు



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలలో సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఏడు దశల్లో నిర్వహించినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అందులో తీవ్ర అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఎలాంటి పరీక్షలు రాయకుండానే స్పోర్ట్స్ కోటా కింద సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగాలు కేటాయించడంపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీచర్ జాబ్స్ కోసం చూస్తున్న అభ్యర్థుల జీవితాలు అంటే మీకు నవ్వులాట అయిందా అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్న వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని, స్పోర్ట్స్ కోటాలో జాబ్ కొట్టినట్లు చెబుతున్నా, అసలు ఈవెంట్లలో విజేతల జాబితాలో మెగా డీఎస్సీ జాబ్ కొట్టిన వారి పేర్లు ఎందుకు లేవో చెప్పాలన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

కేస్ స్టడీ 1 ? విజేతల జాబితాలోనే లేని పేర్లు

విశాఖపట్నంలో యోగేశ్వరరావు అనే అభ్యర్థికి, అలాగే ఆయన చెల్లికి ఎలాంటి రాత పరీక్ష లేకుండానే స్పోర్ట్స్ కేటగిరీ కింద ఎస్జీటీ టీచర్ పోస్టులు ఇచ్చారని జగన్ పేర్కొన్నారు. 2009లో నల్గొండలో జరిగిన 23వ సీనియర్ సౌత్ నేషనల్ ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో వీరిద్దరూ వరుసగా తొలి, రెండో స్థానాలు సాధించినట్లు సర్టిఫికెట్లు సబ్మిట్ చేశారు. అయితే, తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ విడుదల చేసిన విజేతల అధికారిక జాబితాలో వీరి పేర్లు లేవని తేలిందని జగన్ స్పష్టం చేశారు.

కేస్ స్టడీ 2 ? నకిలీ సర్టిఫికేట్ల నిర్లక్ష్యం

మరో కేసులో బసవేశ్వరరావు అనే అభ్యర్థి గుడివాడలో జరిగిన 49వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికేట్ సమర్పించి ఉద్యోగం పొందారని వైఎస్ జగన్ తెలిపారు. ఈ సర్టిఫికేట్ నకిలీదని ఖో-ఖో అసోసియేషన్ స్వయంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాంఖ) కు నియామకాల కంటే ముందే (11-07-2025న) అధికారిక లేఖ ద్వారా తెరిపించినప్పటికీ, ఆ లేఖను పక్కన పడేసి ఉద్యోగం ఇచ్చారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు.

కేస్ స్టడీ 3 ? జరగని క్రీడా పోటీల పేరుతో ఉద్యోగాలు

ప్రగడ కళ్యాణి అనే అభ్యర్థికి 2003లో నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నట్లు ఉన్న సర్టిఫికేట్ ఆధారంగా ఎలాంటి పరీక్ష లేకుండానే ఉద్యోగం ఇచ్చారని జగన్ తెలిపారు. అయితే నాగార్జున యూనివర్సిటీలో ఆల్ ఇండియా పోటీలు అసలు జరగలేదని, అక్కడ కేవలం సౌత్ వెస్ట్ జోన్ పోటీలు మాత్రమే జరిగాయని తేలినట్లు పేర్కొన్నారు. 7 ఫేజ్ వెరిఫికేషన్ పూర్తయినా ఇలాంటి ఫేక్ సర్టిఫికేట్లతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడం మెగా డీఎస్సీ స్కామ్‌ను స్పష్టం చేస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు.

ఏపీలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో పర్యటించి, రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో నిర్మించిన 22 ఆరోగ్య ప్రాజెక్టులను సంయుక్తంగా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర, అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు.విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ (ఐపీహెచ్) ల్యాబొరేటరీలను నడ్డా, చంద్రబాబు నేరుగా ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఐపీహెచ్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నడ్డా సహకారంతో రాష్ట్ర వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. "త్వరలోనే రాష్ట్రంలో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ఇది వైద్య రంగంలో ఒక గేమ్ ఛేంజర్ కానుంది. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం" అని చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోందని, లడ్డాఖ్‌లో కూడా అమరావతి గురించి చర్చించుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. "అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'బయో క్వాంటం వ్యాలీ'కి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాను. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ప్రారంభం కానుంది" అని కేంద్ర మంత్రి నడ్డాను అభ్యర్థించారు. ఆహారమే ఔషధంగా 'కిచెన్ ఫార్మసీ'ని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని సూచించారు. కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఏపీని 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

పాదయాత్రే.. సర్వరోగనివారిణి....

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల క్యాడర్‌తో, నేతలతో మాట్లాడేటప్పుడు కళ్లు మూసుకుందాం.. కాలం గడిచిపోతుంది అనే ఊతపదాన్ని పదే పదే వాడుతుండటం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిత్యం క్షేత్రస్థాయిలో ఎండగట్టడం, ప్రజల్లో ఉండి నిరసనలు చేయడం కంటే.. ఐదేళ్ల కాలాన్ని దాటవేయడమే ప్రధాన వ్యూహంగా ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మరో ఏడాది ఓపిక పడితే కళ్లు మూసుకునేలోపు పాదయాత్ర సమయం వచ్చేస్తుందని, ఆ ఒక్క పాదయాత్ర చేస్తే చాలు మళ్లీ ఓటర్లు బ్రహ్మరథం పడతారని క్యాడర్‌కు నూరిపోస్తున్నారు. అయితే, వైసీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన రాజకీయ, సంస్థాగత సమస్యలకు పాదయాత్ర అనేది సర్వరోగ నివారిణి అని జగన్ నమ్మడం ఎంతవరకు సమంజసం?ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో పాదయాత్రలకు ఒక ప్రత్యేకమైన గ్లామర్, ఆకర్షణ ఉండేవి. వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఆ తర్వాత వైఎస్ జగన్ చేసిన పాదయాత్రలు వారిని అధికార పీఠం ఎక్కించాయన్నది పచ్చి నిజం. కానీ, ఒకే రాజకీయ వ్యూహం ప్రతిసారీ పలికిస్తుందనుకోవడం పొరపాటే. 2019 నాటికి ఉన్న పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం, ఓటర్ల మానసిక స్థితి వేరు.. నేటి పరిస్థితులు వేరు. ఒకప్పుడు పర్యటనల ద్వారా ప్రజలను కలవడం కొత్తగా ఉండేది, కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో నాయకుడి ప్రవర్తన, ప్రతిస్పందనలు ప్రతిరోజూ ప్రజల వద్దకే చేరుతున్నాయి. కేవలం ఎన్నికల ముందు ఐదు వేల కిలోమీటర్లు నడిచేస్తే అధికార పీఠం దక్కేంత అమాయకంగా నేటి ఓటర్లు లేరు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ముందుకు నడిపించడం ప్రధాన బాధ్యత. కానీ, "కళ్లు మూసుకుంటే ఐదేళ్లు గడిచిపోతాయి అనే ధోరణి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు, కేసులు, స్థానిక వివాదాల్లో తమకు అండగా నిలబడే నాయకత్వం కరువైందనే భావన వైసీపీ శ్రేణుల్లో ఉద్భవిస్తోంది. ప్రజా పోరాటాలు చేయకుండా, కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై ఎన్నికల ముందు వస్తా అని చెప్పడం వల్ల పార్టీ క్షేత్రస్థాయి పునాదులు మరింత బలహీనపడే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి.నేటి ఓటర్లు,



ముఖ్యంగా జెన్ జీ, తటస్థ ఓటర్లు ఒక నాయకుడు నిరంతరం ఎలా స్పందిస్తున్నాడు, అసెంబ్లీకి వెళ్తున్నారా లేదా, ప్రజా సమస్యలపై ఎలాంటి ప్రతిపాదనలు ఇస్తున్నారనేది గమనిస్తున్నారు. 2019లో ఇచ్చిన హామీలు, ఆ తర్వాత ఐదేళ్ల పాలనను అనుభవించిన ప్రజలు, ఇప్పుడు కేవలం ఓదార్పులు లేదా సుదీర్ఘ నడకలకే ఓటేస్తారని భావించడం రాజకీయ అపరిపక్వత కిందకే వస్తుంది. పాదయాత్రలకు ఉన్న వాల్యూ కాలక్రమేణా తగ్గిపోయింది. పవన్ కల్యాణ్ చేసిన వారాహి యాత్ర లేదా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రలు సైతం సాంప్రదాయ పాదయాత్రల రూపురేఖలను మార్చేశాయి. ఈ నేపథ్యంలో జగన్ పాత తరహా పాదయాత్రనే మళ్లీ నమ్ముకోవడం పెద్ద రిస్క్.వైసీపీ ఎదుర్కొంటున్న అసలు సమస్య పాదయాత్ర లేకపోవడం కాదు. ప్రతి చిన్న విషయానికీ అధినేతపైనే ఆధారపడే సంస్కృతి ఉంది. ఇలాంటి సమయంలో కళ్లు మూసుకుందాం అనే మంత్రం జపిస్తే.. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న పార్టీకి, నిరంతర ప్రజా ఉద్యమాలే ఊపిరి పోస్తాయి తప్ప, రాబోయే పాదయాత్ర కోసం చేసే నిరీక్షణ కాదు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ను ఒక మాయాజాలంగా భావిస్తున్నారు. కానీ రాజకీయాల్లో కాలం దానంతట అదే మాయలు చేయదు. ప్రజా సమస్యలపై పోరాడకుండా, కేవలం కళ్లు మూసుకుని కాలం గడిపేస్తే మళ్లీ జనం ఓటేస్తారనుకోవడం రాజకీయ భ్రమ మాత్రమే. 2029 నాటికి రాజకీయ సమీకరణాలు, జనాభా మార్పులు, ఓటర్ల ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో అంచనా వేయకుండా, ఒకే సెంటిమెంట్‌ను పదే పదే నమ్ముకుంటే అది వైసీపీకే పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అభిప్రాయం

వంద శాతం స్ట్రైక్ రేట్ పై దృష్టి

తిరుపతి, : ఏపీలో స్థానిక సంస్థల వేడి రాజుకుంది. అయితే సాధారణంగా ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు ముందుగా తమ ఆసక్తిని వ్యక్తం చేస్తారు. అలా కూటమిలోని మూడు పార్టీలలో ఔత్సాహికులు తమ అభిలాషను వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారికంగా ఎవరూ బయటకు చెప్పలేకపోతున్నారు. దానికి కూడా కూటమిగా ఉండడం. ఎవరికి వారుగా ముందుగా ప్రకటించుకోవద్దని తమ పార్టీల నాయకులకు కూటమి పార్టీల అధినాయకత్వాలు హెచ్చరించిన నేపథ్యం ఉంది. అదే సమయంలో సీట్లు ఎవరికి ఎంత శాతం అన్న లెక్క ముందు తేల్చుకోవాలని చూస్తున్నారు. ఐక్యంగా పోటీ చేయడానికే కూటమి పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. దాంతో సర్దుబాటు కోసం సీట్ల విషయంలో చర్చకు మూడు పార్టీల అధినాయకత్వాలు కలిసి చర్చించడానికి సిద్ధపడుతున్నాయి ఇక కూటమి పార్టీలలో ముఖ్యమైన మిత్ర పక్షం జనసేన. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకృతి వైద్యం కోసం కేరళం వెళ్ళిన సంగతి విధితమే. ఆయన ఇపుడు అక్కడే ఉన్నారు. ఆయన ఎపుడు వస్తారు అంటే ఎవరికి వారికి ఊహాగానాలు ఉన్నాయి. అయితే తాజాగా జనసేన పార్టీ సామావేశంలో ఆ పార్టీ సీనియర్ నేత మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 15న పవన్ వస్తారు అని చెప్పడం జరిగింది. ఆయన పార్టీ ఆఫీసుకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల మీద సమీక్షలు నిర్వహిస్తారు అని చెప్పారు. పవన్ బీ ఫారాలు ఇస్తారని ఆయన సంతకం చేసిన బీ ఫారాలు ఉన్న వారే అభ్యర్థులుగా ఉంటారని ఈ లోగా ఎవరు పోటీ చేస్తామని ప్రకటించుకున్నా అది తొందరపాటు వ్యక్తిగతం అవుతుందని అంటున్నారు. దాంతో పవన్ వచ్చాక కూటమి నేతల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో చర్చలు జరుగుతాయని అంటున్నారు మరో వైపు చూస్తే బీజేపీ కూడా సీట్ల సర్దుబాటు విషయంలో ఫోకస్ పెట్టింది అని అంటున్నారు. ఆ పార్టీ



కూడా కూటమితో పొత్తులో ఉంటే గణనీయంగా సీట్లు గెలుచుకోవచ్చు అని భావిస్తోంది. ఈసారి ఆ పార్టీ నుంచి కూడా అనేక మంది పోటీకి తయారుగా ఉన్నారు. విశాఖ, రాజమండ్రి మేయర్ సీట్ల కోసం బీజేపీ పట్టుబడుతోంది. అలాగే జెడ్పీల విషయానికి వస్తే అల్లూరి జిల్లాతో పాటు గోదావరి జిల్లాలు కోస్తాలో కొన్ని కోరుకుంటోందిఅని అంటున్నారు. ఈ ప్రచారం ఇలా ఉండగానే స్థానిక ఎన్నికలవిషయంలో ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్ స్పందించారు. స్థానిక ఎన్నికల్లో సీట్ల పంపకాలపై క్లారిటీ రాలేదు అని ఆయనచెప్పడం విశేషం.రానున్న మూడు రోజులలో కూటమి పార్టీలు కూర్చుని చర్చిస్తామని చెప్పారు. అలాగే స్థానిక ఎన్నికల పోటీ విధివిధానాలపై చర్చ ఉంటుందని అన్నారు. ఈసారి బీజేపీ నుంచి కూడా వంద శాతం స్ట్రైక్ రేట్ కోసం ప్రయత్నిస్తామని మాధవ్ చెప్పడం విశేషం. స్థానిక ఎన్నికలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ స్పందన చూస్తే మరో మూడు రోజులలో కూటమి పార్టీలు కలిసి కూర్చుని చర్చిస్తాయని క్లారిటీ అయితే వచ్చింది. వినాయకచవితి పండుగ దగ్గరలో ఉంది. అది అయిన తరువాత ఈ నెల 16న చంద్రబాబు పవన్ కళ్యాణ్ మాధవ్ సీట్ల సర్దుబాటు గురించి కీలక చర్చలు జరుపుతారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

చిన్న శీను ఓపెనర్ మాత్రమే



విజయనగరం, : ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

నాగబాబుకు జోడు పదవుల రచ్చ..



గుంటూరు, : నసేన పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ (కేబినెట్ హోదా) కొణిదెల నాగబాబు చిక్కుల్లో పడ్డారా?. ఆయనకు జోడు పదవుల వివాదం తలనొప్పిగా మారబోతుందా?. సోషల్ మీడియా వేదికగా అదే చర్చ జరుగుతోంది.. జోడు పదవుల అంశం తెరపైకి వచ్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. గతంలో జయా బచ్చన్‌పై జోడు పదవులతో అనర్హత వేటు పడిందని.. ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుపై అనర్హత వేటు పడుతుందని కొందరు ట్వీట్‌లు చేశారు.ఏపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ నాగబాబును ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించి కేబినెట్ హోదా కల్పించింది. ఆయన జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి జీవోలో పేర్కొన్నారు. అయితే ఏదైనా ఉభయ సభల్లో సభ్యులుగా ఉన్నవారు ఇతర లాభదాయక పదవుల్లో ఉండకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ)ని గుర్తు చేశారు.. ఒక వ్యక్తి అటు కేంద్ర ప్రభుత్వంలో కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో కానీ లాభదాయకమైన పదవిలో ఉంటే.. వారి రాష్ట్ర శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా పదవిలో కొనసాగడానికి అనర్హుడవుతారని రాజ్యాంగంలో స్పష్టం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ హోదా, నెలకు 3.80 లక్షల రూపాయల జీతభత్యాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది నూటికి నూరు శాతం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) కిందకు వస్తుంది కాబట్టి ఎమ్మెల్సీ నాగబాబు మీద అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు. నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఉండగానే మళ్లీ ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కేబినెట్ ర్యాంకుతో ఇవ్వడం, వేతనం పొందడం రాజ్యంగ విరుద్ధమనేది కొందరి వాదన.. ఇదే అంశాన్ని ట్వీట్‌లో ప్రస్తావించారు.గతంలో జయాబచ్చన్‌పై ఇలాగే అనర్హత వేటు పడిందంటున్నారు. జయా బచ్చన్ గతంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న సమయంలో.. మళ్లీ ఉత్తరప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ పదవి ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) పరిధిలోకి వస్తుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జయా బచ్చన్ రాజ్యసభ ఎంపీ పదవిపై మార్చి 2006లో అనర్హత వేటు పడింది. జయా బచ్చన్ మాత్రమే కాదు మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయని చెబుతున్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వం నుంచి వేతనం, ప్రతిఫలం వచ్చే మరో లాభదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్)లో ఉండకూడదు. ఒకవేళ లాభదాయక పదవిని చేపడితే ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ రూల్‌నే ప్రధానంగా నాగబాబు విషయంలో ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో నాగబాబుపై అనర్హత వేటు పడకుండా ఏపీ ప్రభుత్వానికి మరో వెసులుబాటు కూడా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ మినహాయింపు చట్టాన్ని ప్రధానంగా గుర్తు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేకంగా చట్టం చేసి కొన్ని పదవులకు ఈ అనర్హత నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టం, 1953 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లు, సొసైటీలు, కమిటీల ఛైర్మన్ పదవులను ఈ మినహాయింపు జాబితాలో చేరుస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవిని.. అనర్హతల తొలగింపు చట్టం ప్రకారం.. మినహాయింపు పొందిన పదవిగా గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు న్యాయపరంగా ఎలాంటి చిక్కులు ఉండవనే మరో వాదన తెరపైకి వచ్చింది. రెండు పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒక పదవికి మాత్రమే ఆర్థిక వేతనం తీసుకోవడం, రెండో పదవికి అలవెన్సులను కేవలం అధికారిక ఖర్చులకు మాత్రమే పరిమితం చేయొచ్చు. అప్పుడు లాభదాయక పదవి వివాదం రాకుండా చూడొచ్చు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు పదవిని అనర్హతల తొలగింపు చట్టం పరిధిలోకి తీసుకొచ్చినా.. నిబంధనల ప్రకారం ఆర్థిక ప్రయోజనాల విషయంలో మార్పులు చేస్తే చట్టబద్ధమైన పదవిగా మారుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్న అంశాలపై ఏపీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధం

విశాఖపట్నం:విశాఖ నగరంలో శనివారం తెల్లవారుజామున ఒక భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది నెల్లూరు నుంచి ప్రయాణికులతో విశాఖ పట్నం చేరుకున్న ఒక ఏపీఎస్ఆర్టీసీ (ంఖూఖీఅ) బస్సు వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకుని నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధ మైంది నెల్లూరు నుంచి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ బస్సు విశాఖకు చేరు కుంది అనంతరం వాల్తేరు డిపో వెలుపల బస్సును నిలిపి ఉంచారు అయితే, శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా బస్సు ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. బస్సు ఖాళీగా ఉన్న సమ యంలోనే ఈ ప్రమాదం జరగడంతో ఒక పెద్ద ముప్పు తప్పింది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించి వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది బస్సు తగల బడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు సిబ్బంది వెంటనే పోలీసుల కు,అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు ఘటనా స్థలానికి చేరు కున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు ఆర్టీసీ ఉన్నతాధి కారులు,పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు ఆర్టీసీ సాంకేతిక విభాగం అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ ప్రమాదం లో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవ డం తో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు

ఫైళ్ల క్లియరెన్స్ లో అచ్చెన్న ఫస్ట్... లాస్ట్ పయ్యావుల

విజయవాడ, : మంత్రులతో పాటుగా అధికారులు ఫైళ్లన్నీ త్వరగా, అదే రోజు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో తేల్చి చెప్పారు. మంత్రుల విషయానికి వస్తే.. ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మొదటి స్థానంలో నిలిచారని చంద్రబాబు ప్రశంసించారు. అచ్చెన్నాయుడు ఫైళ్ల పరిష్కారంలో వేగంతో పాటు స్పష్టత, పారదర్శకత, సామర్థ్యానికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అచ్చెన్నాయుడు తర్వాత రెండో స్థానంలో నిమ్మల రామానాయుడు, మూడో స్థానంలో బీసీ జనార్దన్ రెడ్డి, నాలుగో స్థానంలో ఎన్ఎండీ ఫరూక్, ఐదోస్థానంలో టీజీ భరత్ ఉన్నారని తెలిపారు. చివరి రెండుస్థానాల్లో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పయ్యావుల కేశవ్ ఉన్నారు.ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మంత్రులు ఫైల్స్ క్లియర్ చేసేందుకుఎంత సమయం తీసుకున్నారనే వివరాలతో మంత్రులకు ర్యాంకులను ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు సగటున గంటా 51 నిమిషాలకు ఒక ఫైల్ చొప్పున క్లియర్ చేశారు. ఒక్కో ఫైల్ క్లియర్ చేయడానికి గరిష్ఠంగా ఆరేడు రోజులకు పైన సమయం తీసుకున్న మంత్రులు చివరి స్థానాల్లో ఉన్నారు. ఈ మేరకు జూన్ 9 నుంచి సెప్టెంబర్ 9 వరకు క్లియర్ చేసిన ఫైల్స్ ప్రకారం మంత్రుల ర్యాంకుల వివరాలు ఇలా ఉన్నాయి.అచ్చెన్నాయుడు 675 ఫైళ్లను క్లియర్ చేయగా.. ఒక్కో ఫైలకు గంటా 51 నిమిషాలు సమయం తీసుకుని మొదటి స్థానంలో ఉన్నారు. నిమ్మల రామానాయుడు 410 ఫైళ్లు క్లియర్ చేశారు.. ఆయను ఒక్కో ఫైల్‌కు 6 గంటల 30 నిమిషాల సమయం తీసుకుని రెండో స్థానంలో నిలిచారు. మూడో స్థానంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి 148 ఫైళ్లను క్లియర్ చేసి ఒక్కో ఫైల్‌కు 6 గంటల 52 నిమిషాల సమయం తీసుకున్నారు. నాలుగో స్థానంలో ఎన్ఎండీ ఫరూక్ 275 ఫైల్స్ క్లియర్ చేశారు.. ఒక్కో ఫైల్‌కు 15 గంటల ఒక నిమిషం సమయం పట్టింది. ఐదో స్థానంలో టీజీ భరత్ 238 ఫైల్స్, ఒక్కో ఫైలకు 19 గంటల 51 నిమిషాలు.. ఆరో స్థానంలో పొంగూరు నారాయణ 643 ఫైళ్లు.. ఒక్కో ఫైల్‌కు 20 గంటల 39 నిమిషాలు.. ఏడో స్థానంలో కొలుసు పార్థసారథి 80 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 47 నిమిషాలు.. ఎనిమిదో స్థానంలో డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి 131 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 3 గంటల 32 నిమిషాలు.. 9వ స్థానంలో మంత్రి లోకేష్ 1166 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 7 గంటల 43 నిమిషాలు.. 10వ స్థానంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ 773 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 9 గంటల 8 నిమిషాల సమయం పట్టింది.ఇక 11వ స్థానంలో సత్యకుమార్ యాదవ్ 468 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 16 గంటల 55 నిమిషాలు.. 12వ స్థానంలో వాసంశెట్టి సుభాష్ 148 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు18 గంటల 59 నిమిషాలు.. 13వ స్థానంలో ముఖ్యమంత్రి కార్యాలయం 1542 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 20 గంటల 5 నిమిషాలు.. 14వ స్థానంలో గొట్టిపాటి రవికుమార్ 134 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 20 గంటల 5 నిమిషాలు.. 15వ స్థానంలో కొండపల్లి శ్రీనివాస్ 45 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు రెండు రోజుల 5 గంటల 3 నిమిషాలు.. 16వ స్థానంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 612 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు 2 రోజుల 15 గంటల 29 నిమిషాలు.. 17వ స్థానంలో గుమ్మిడి సంధ్యారాణి 119 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు 2 రోజుల 20 గంటల 41 నిమిషాల సమయం పట్టింది. ఇక 18వ స్థానంలో నాదెండ్ల మనోహర్, 19వ స్థానంలో కందుల దుర్గేష్, 20 స్థానంలో వంగలపూడి అనిత, 21వ స్థానంలో అనం రామనారాయణరెడ్డి, 22వ స్థానంలో ఎస్ సవిత, 23వ స్థానంలో కొల్లు రవీంద్ర, 24వ స్థానంలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, 25వ స్థానంలో పయ్యావుల కేశవ్ నిలిచారు.

రేసులోకి వచ్చిన ఆనం

నెల్లూరు : నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. దెబ్బకు డిలీట్ ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో (రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యాటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్నచర్చ.మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు



బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు;
ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరఫున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్క

ఉల్లిగడ్డ పాట్లులో ఉన్న లాభాలు...!



ఉల్లిపాయ పొట్టుతో ఎన్నో లాభాలున్నాయి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. ప్రతిరోజూ వంటగదిలో చాలా కూరగాయలు, పండ్ల తొక్కలు, ఇతర వ్యర్థాలు జమ అవుతాయి. చాలామంది వాటిని పనికిరావని భావించి చెత్తబుట్టలో వేస్తారు. కానీ, నిజానికి వాటిలో కూడా అనేక ప్రయోజనాలు దాగి ఉంటాయి. అలాంటివాటిలో ఉల్లిపాయ పొట్టు కూడా ఒకటి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. 1. సహజ ఎరువుగా.. ఉల్లిపాయ తొక్కలను సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇవి మొక్కల పెరుగుదలకు సహాయపడతాయి. తొక్కలను నీటిలో నానబెట్టి ఆ నీటిని మొక్కలకు పోస్తే ఆకులు పచ్చగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. 2. జుట్టు సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలు జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తాయి. ఒక గిన్నెలో నీరు తీసుకుని ఉల్లిపాయ తొక్కలను వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత ఆ నీటిని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు మెరిసేలా, బలంగా, మందంగా మారుతుంది.

3. టీగా.. కొంతమందికి మాత్రమే తెలిసిన విషయం ఏమిటంటే.. ఉల్లిపాయ తొక్కలతో టీ కూడా తయారు చేయవచ్చు. ఈ టీ తాగడం వల్ల ఊబకాయం తగ్గడంలో సహాయపడుతుంది. అలాగే అలెర్జీలు, ఇన్ఫెక్షన్లు, అధిక రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. 4. చర్మ సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. తొక్కలను నీటిలో మరిగించి, చల్లారిన తర్వాత ఆ నీటిని చర్మానికి అప్లై చేస్తే చర్మం తాజాగా కనిపిస్తుంది. ఉల్లిపాయ తొక్కలను ఇంటి శుభ్రపరచడంలో కూడా ఉపయోగించవచ్చు. తొక్కలను నీటిలో మరిగించి ఆ నీటితో వంటగదిని లేదా ఇంటిని శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోతాయి. దీనిని ప్రతిరోజూ కూడా ఉపయోగించవచ్చు.

వ్యాయామం చేయకుండానే బరువు తగ్గొచ్చు!

నేటి కాలంలో చక్కెర లేనిదే మన రోజు గడవదు. ఉదయం తాగే టీ, కాఫీ నుంచి రాత్రి తినే స్వీట్ల వరకు ప్రతి దాంట్లోనూ పంచదార ఒక అంతర్భాగమైపోయింది. అయితే, ఈ తీపి పదార్థాలు శరీరానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు. అధిక బరువు, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు మరియు దంత క్షయానికి చక్కెర ప్రధాన కారణం. మరి కేవలం ఆహారంలో చక్కెరను పక్కన పెడితే ఎంత బరువు తగ్గొచ్చో తెలుసా? బరువు తగ్గాలని కఠినమైన వర్కౌట్లు చేస్తున్నా ఫలితం రావడం లేదా? అయితే మీరు తీసుకునే తీపి పదార్థాలపై ఒక్కసారి కన్నేయండి.డాక్టర్ సుధీర్ కుమార్ ఒక 40 ఏళ్ల వ్యక్తిని ఉదాహరణగా తీసుకుని ఈ లెక్కలు వివరించారు. కేవలం పైన చెప్పిన ఆహార పదార్థాలను మానేయడం ద్వారా, సదరు వ్యక్తి నెలకు సుమారు 1.5 కిలోల బరువు తగ్గుతారని డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. ఏ విధమైన కొత్త వ్యాయామాలు చేయకుండానే ఏడాదికి సుమారు 18 కిలోల బరువు తగ్గే అవకాశం ఉంటుంది. లిక్విడ్ క్యాలరీల (సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్) వల్ల కడుపు నిండిన అనుభూతి కలగదు. వీటిని చాలా త్వరగా తాగేయొచ్చు, దీనివల్ల మనం తెలియకుండానే ఎక్కువ క్యాలరీలను శరీరానికి ఇస్తాం. అందుకే ఇవి బరువు పెరగడానికి, డయాబెటిస్ మరియు ఫ్యాటీ లివర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణమవుతున్నాయి. బయట దొరికే ఆహార పదార్థాలు కొనేముందు వాటిపై ఉండే న్యూట్రిషన్ లేబుల్స్ చదవండి. సాధ్యమైనంత వరకు సహజమైన పండ్లనే తినండి, రసాలు కాదు.చక్కెరను తగ్గించడం వల్ల శరీరంలో ఎనర్జీ లెవల్స్ కూడా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాయి. చక్కెరను మానేయడం అనేది కేవలం బరువు తగ్గడానికే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ముఖ్యం. అయితే ఈ లెక్కలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. కాబట్టి మీ వయస్సు, ఆరోగ్య స్థితిని బట్టి సరైన డైట్ ప్లాన్ కోసం నిపుణులను సంప్రదించడం మంచిది.



బొప్పాయి తింటే..!



బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు. కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు
ఉత్తమ సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు.
కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు ఉత్తమ సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి9, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి1, విటమిన్ బి3, విటమిన్ బి5, విటమిన్ ఇ, విటమిన్ కె వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి జీర్ణక్రియ, జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహారం సమయంలో బొప్పాయి పండును తినడం ఉత్తమం. ఇది రోజంతా జీర్ణవ్యవస్థలో సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, బొప్పాయి ప్రేగులను నిర్విషీకరణ చేస్తుంది కాబట్టి, రాత్రిపూట కూడా తినవచ్చు. కానీ భోజనం తర్వాత కనీసం 3 నుంచి 4 గంటల వరకు పండ్లు తినకుండా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే భోజనం చేసిన వెంటనే తినడం వల్ల జీర్ణవ్యవస్థకు అంతరాయం కలుగుతుంది. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్‌ను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. అల్పాహారంగా బొప్పాయి తినడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలను నివారిస్తుంది. బొప్పాయిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది పేగులను శుభ్రపరుస్తుంది. కడుపును తేలికగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బొప్పాయి విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల శరీరానికి ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి శక్తి లభిస్తుంది. ఇది జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధుల నుండి రక్షించడంలోనూ సహాయపడుతుంది. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు.

మధ్యాహ్నం నిద్రపోతే శరీరంలో ఏం జరుగుతుంది?



చాలా మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాసేపు అలా కనుకు తీయడం అలవాటు. కొందరు దీన్ని సోమరితనంగా భావిస్తే మరికొందరు అలసటను తగ్గించుకునే మార్గంగా చూస్తారు. అయితే మధ్యాహ్నం నిద్ర అందరికీ ఒకేలా పని చేయదని, అది మనం నిద్రపోయే సమయం, వ్యవధిపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ విశ్లేషణ ప్రకారం..
మధ్యాహ్నం పూట 20 నుండి 30 నిమిషాల
చిన్న విశ్రాంతి వల్ల పని సామర్థ్యం, ఏకాగ్రత మెరుగుపడతాయి. రాత్రి నిద్ర సరిగ్గా లేని వారికి లేదా శారీరక శ్రమ అధికంగా చేసే వారికి ఈ చిన్న నిద్ర రీఛార్జ్‌లా పనిచేస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచి, మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడిపేలా చేస్తుంది. గంట దాటితే ముప్పే: మధ్యాహ్నం నిద్ర ప్రయోజనకరమే అయినప్పటికీ అది గంట దాటితే మాత్రం అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గంట కంటే ఎక్కువ నిద్రపోతే లేచిన తర్వాత తలనొప్పి, బద్ధకం, శరీరం బరువుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి.

ఆ మాట చెప్పగానే ప్రభాస్ పెద్దగా నవ్వి అలా అన్నారు



రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'ఫౌజీ' ఒకటి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదే బ్యానర్‌పై రవితేజ హీరోగా, ప్రియా భవానీ శంకర్ కథానాయికగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రాన్ని కూడా నిర్మించారు. ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను నిన్న రాత్రి భీమవరంలో భారీ ఈవెంట్ నిర్వహించి విడుదల చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో భాగంగా మైత్రి రవి 'ఫౌజీ' గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. ఫౌజీ చిత్రంతో ప్రభాస్‌కు అద్భుతమైన విజయం దక్కడం ఖాయం. ప్రభాస్ గారు ఈ సినిమాపై చాలా కాన్సన్‌ట్రేషన్ పెట్టారు. నిన్న ఆయనకు షూటింగ్ కూడా లేదు.
అయినప్పటికీ సెట్‌కు వచ్చి మానిటర్ ముందు కూర్చొని ప్రతి సన్నివేశాన్ని అబ్జర్వ్ చేశారు. దీనిని బట్టి ఆయన ఈ సినిమాపై ఎంత కాన్ఫిడెంట్‌గా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.
చెప్పినట్లు మైత్రి రవి తెలిపారు. సార్.. మీ ఫ్యాన్స్‌కు ఏమైనా చెప్పమంటారా? అని అడిగితే, "ఎక్కడ చేస్తున్నారు?" అని ప్రభాస్ అడిగారట. తాము ఓ కాలేజీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పడంతో ప్రభాస్ బిగ్గరగా నవ్వి.. కాలేజ్ అంటున్నారు కదా.. మంచిగా చదువుకోమని చెప్పండని అన్నారని మైత్రి రవి వెల్లడించారు.

నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి.....



ప్రముఖ బాలీవుడ్ నటి మల్లికా షెరావత్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రస్తుతం 49 ఏళ్ల వయసులో ఉన్న ఆమె.. యంగ్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని గ్లామర్‌ను మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియా వేదికగా, పలు కార్యక్రమాల్లో తన గ్లామరస్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. తాజాగా మల్లికా ఓ హాలీవుడ్ స్టార్ హీరోపై చేసిన సంచలన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రెయిటర్స్ సీజన్ 2'లో పాల్గొన్న ఆమె.. తనకు ఎవరిపైనా క్రష్ లేదని, అందరికీ తనపైనే క్రష్ ఉందని సరదాగా వ్యాఖ్యానించారు.
ఈ సందర్భంగా కొంతకాలం క్రితం హాలీవుడ్ స్టార్ హీరో టామ్ క్రూజ్ కూడా తనపై మనసు పారేసుకున్నారని మల్లికా షెరావత్ వెల్లడించారు. నేను ఈ విషయంలో అస్సలు అబద్ధం చెప్పడం లేదు. ప్రస్తుతం నా దగ్గర ఫోన్ లేదు. ఒకవేళ ఫోన్ ఉండి ఉంటే.. ఆయన నాకు పంపిన వీడియోలను చూపించేదాన్ని అని ఆమె పేర్కొన్నారు. మల్లికా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.
టామ్ క్రూజ్ తనపై మనసు పారేసుకున్నారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు ఆసక్తిగా స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా కొంతకాలం క్రితం హాలీవుడ్ స్టార్ హీరో టామ్ క్రూజ్ కూడా తనపై మనసు పారేసుకున్నారని మల్లికా షెరావత్ వెల్లడించారు. నేను ఈ విషయంలో అస్సలు అబద్ధం చెప్పడం లేదు.

రజనీకాంత్‌తో నా మొదటి పరిచయం అలా జరిగింది

టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ.. ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది,
అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను,
ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు,
అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు" అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.





Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com